teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 385 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 29 మే 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## సోనియా గాంధీతో సీఎం రేవంత్ ప్రత్యేక భేటీ

**సోనియా గాంధీకి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ఆహ్వానం**

తెలంగాణ బ్యూరో, మే 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ప్రత్యేకంగా సోనియా గాంధీతో భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అవుతోన్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2 లో



## ప్రభుత్వ పాఠశాలలు లేని గ్రామాలు 265

**రాష్ట్రంలో నూతన పాఠశాలలకు ప్రభుత్వం శ్రీకారం**

**మూతపడ్డ స్కూళ్లను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు**

తెలంగాణ బ్యూరో, మే 28 (తీన్మార్ న్యూస్) రాష్ట్రంలో 265 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేవని విద్యాశాఖ అధికారులు లెక్కల ద్వారా తేలింది. పిల్లలు లేరనే కారణంతో గత ప్రభుత్వ హయాంలో మూతపడ్డ పాఠశాలలే ఇందులో ఎక్కువగా ఉన్నాయి. వీటిలో మెజార్టీ స్కూళ్లను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో నూతన పాఠశాలలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ప్రతీ గ్రామ పంచాయతీలో తప్పకుండా ప్రభుత్వ పాఠశాల ఉండాలన్న సీఎం నిర్ణయం మేరకు ఆ దిశగా

మిగతా 2 లో



# పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు

**ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేయాలంటూ సుప్రీం ఆదేశాలు**

**దారుణ అనుభవాల ఫిర్యాదులతో సుప్రీంకోర్టు నిర్ణయం**

పోలీస్ స్టేషన్ లలో సీసీ కెమెరాల విషయంలో సుప్రీం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతీ పోలీస్ స్టేషన్ లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అన్ని పోలీస్ స్టేషన్లలోను సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులను సుప్రీంకోర్టు ఆదేశించింది.

న్యూ ఢిల్లీ, మే 28 (తీన్మార్ న్యూస్):ఫ్రెండ్లీ పోలీసింగ్ అని చెప్పినా సామాన్య ప్రజలకు పోలీస్ స్టేషన్లలో దారుణమైన అనుభవాలు ఎదురవుతున్నాయంటూ ఫిర్యాదులు రావడంతో సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. అధికారం ఉన్నవారికి డబ్బులు ఉన్నవారికి పోలీసులు కొమ్ముకాస్తూ సామాన్యులపై ఉక్కుపాదం మోపుతున్నారనే ఆరోపణలతో యాక్షన్ తీసుకుంది సుప్రీం. కొన్ని పీఎస్ లు ఏకంగా సెటిల్మెంట్ కు అడ్డాగా మారుతున్నాయని లాకప్ డెత్, బెదిరింపులు, వసూళ్లు, అక్రమార్కులకు అండదండగా

మిగతా 2 లో



## ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు

**పలు జిల్లాల్లో ఏకకాలంలో సోదాలు**

**పలువురు అధికారులను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు**

తెలంగాణ బ్యూరో, మే 28 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించడం కలకలం రేపుతోంది. మంగళవారం ఉదయం

మిగతా 2 లో

## కేటీఆర్, హరీశ్ రావు ఫోన్ ట్యాపింగ్ పై విచారణను కోరరా

**అన్నింటికీ సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తారు.. దీనికెందుకు కోరట్లేదు**

**కేటీఆర్, హరీశ్ రావు తీరుపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు**



.. వివరాలు 2లో



## అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ

**మధ్యంతర బెయిల్ విచారణ అనుమతించేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ**

న్యూ ఢిల్లీ, మే 28 (తీన్మార్ న్యూస్): అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వైద్య కారణాలతో తన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఏడు రోజుల పాటు పొడిగించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి వేసిన పిటిషన్ను అత్యవసర

మిగతా 2 లో

## కాకతీయ కళాతోరణంపై ఎందుకంత కోపం



**చార్మినార్ చిహ్నం అంటే మీకెందుకంత చిరాకు**

**కాకతీయ కళాతోరణం, చార్మినార్ అనేవి వెయ్యేళ్ల సాంస్కృతి వైభవానికి చిహ్నాలు**

**సీఎం రేవంత్‌ను సూటిగా ప్రశ్నించిన కేటీఆర్**

తెలంగాణ బ్యూరో, మే 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే పలుమార్లు బహిరంగంగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేసీఆర్ తీసుకొచ్చిన టీఎస్ స్థానంలో రేవంత్ టీజీ తీసుకొచ్చారు. తాజాగా అధికారిక చిహ్నంలో మార్పులు చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. కేసీఆర్ హయాంలో రూపొందించిన రాష్ట్ర అధికారిక చిహ్నంలోని కాకతీయ కళాతోరణాన్ని తీసేస్తున్నట్లు రేవంత్ ఢిల్లీ వేదికగా ప్రకటించారు. రేవంత్ నిర్ణయంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మీకు కాకతీయ కళాతోరణంపై ఎందుకంత కోపం చార్మినార్ చిహ్నం అంటే మీకెందుకంత చిరాకు అని రేవంత్‌ను సూటిగా ప్రశ్నించారు. ఇదెక్కడి మూరపు ఆలోచన అని

మిగతా 2 లో



## ఎన్నికల కోడ్ అనంతరం మొదలవనున్న హామీల అమలు

**ఆగస్టు 15వ తేదీ లోగా రైతు రుణమాఫీ చేస్తామని స్పష్టం**

**ట్విట్టర్ (X) ద్వారా మంత్రి పొంగులేటి పోస్ట్**

హైదరాబాద్, మే 28 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎప్పటి నుంచో ఆగిపోయి ఉన్న రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని రెవెన్యూ, గృహ

## మెడిగడ్డలో కొనసాగుతున్న మరమ్మతు పనులు

**జియో ఫిజికల్ జియో టెక్నికల్ పరీక్షల కోసం రానున్న నిపుణుల బృందం**



.. వివరాలు 2లో

## ప్రతిపక్ష "బీఆర్ఎస్" పార్టీ గుర్తింపు రద్దు చేయాలి

**బీజేపీ అభ్యర్థి రఘునందన్ సంచలన డిమాండ్**



దుబ్బాక, మే 28 (తీన్మార్ న్యూస్): దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ సంచలన డిమాండ్ చేశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని ఆయన ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు

మిగతా 2 లో



## పిల్లల అక్రమ విక్రయ ముఠా గుట్టురట్టు

**ఇతర రాష్ట్రాల పిల్లలను తెలుగు రాష్ట్రాల్లో విక్రయిస్తున్న ముఠా అరెస్ట్**

**13మందిని కాపాడి ముగ్గురిని 3 నిందుతుల అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**సంచలన విషయాలను వెల్లడించిన రాచకొండ సీపీ తరుణ్ జోషి**

వివరాలు 2 లో

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేసీఆర్ ప్రస్తావన

**ముందే కేసీఆర్‌కు సమాచారం ఉంది.. కవిత టీమ్‌తో పరిచయం**

**బెయిల్ పిటిషన్లపై విచారణలో ఈడి తరుపు వాదనలు**



తెలంగాణ బ్యూరో, మే 28 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మరో సంచలన పరిణామం చోటు చేసుకుంది. మద్యం పాలసీలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేరును ఈడీ తెరపైకి తీసుకువచ్చింది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్లపై మంగళవారం ఢిల్లీ హైకోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా విస్తుపోయే విషయాలను ఈడీ బయటపెట్టింది. ఢిల్లీ మద్యం విధానం, రిటైల్ వ్యాపారం గురించి ముందే కేసీఆర్‌కు సమాచారం ఉందని, ఈ వ్యాపారం గురించి కేసీఆర్‌కు కవిత ముందే వివరాలు చెప్పారని కామెంట్ చేసింది. కవిత తన టీమ్ బుచ్చిబాబు, అభిషేక్, అరుణ్ పిళ్లైలను కేసీఆర్‌కు పరిచయం చేశారు. ఢిల్లీలోని తెలంగాణ సీఎం అధికారిక నివాసంలోనే వారిని కేసీఆర్‌కు కవిత పరిచయం చేశారు. బుచ్చిబాబు కేసీఆర్‌కు సమీర్

మిగతా 2 లో

# ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు

మొదటి పేజీ తరువాయి

నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మహబ్ నగర్, మహబూబాబాద్, నల్గొండతో పాటు పలు జిల్లాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. 12 ఏళ్ల తర్వాత ఆర్టీఏ కార్యాలయాల్లో జరుగుతున్న ఈ ఆకస్మిక తనిఖీల్లో పలువురు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కౌంటర్లలోని ఉద్యోగుల వద్ద లెక్కలు చూపని నగదు లభ్యం అయినట్లు తెలుస్తోంది. ఇక ఏసీబీ సోదాల వల్ల దరఖాస్తుదారులను పోలీసులు నిలిపివేశారు.




**పెద్ద ఎత్తున ఆరోపణలు**

రవాణా శాఖలో జరుగుతున్న అవినీతిపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ ఏజెంట్ల ద్వారా జరుగుతున్న దందాపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే టాక్ వినిపించింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఏక కాలంలో మెరుపుదాడులతో విరుచుకుపడిన ఏసీబీ అధికారులు ప్రతి కార్యాలయంలో మూడు అంతకంటే ఎక్కువ టీమ్ లుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. ఒక టీమ్ బయట ఉన్న ఏజెంట్లను ఆరా తీస్తుండగా మరో టీమ్ కార్యాలయాల్లో ఉన్న అధికారులను ఇక మూడో టీమ్ కేవలం ఆర్టీఏను మాత్రమే ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మలక్ పేట, పాత బస్తీ బండ్లగూడ, టౌలి చౌకి, మహబూబ్ నగర్ లోని ఆర్టీఏ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి ఐదుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట చెక్ పోస్టులోతనిఖీలు చేపట్టి సిబ్బంది వద్ద అక్రమంగా ఉన్న రూ.35 వేలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే చెక్ పోస్టులో అనధికారికంగా విధుల్లో ఏడుగురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు. మహబూబాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీవో గౌస్ పాషా డ్రైవర్ సుబ్బారావును అదుపులోకి తీసుకున్నారు. రవాణా శాఖ అధికారి డ్రైవర్ వద్ద రూ.16,500, లైసెన్సులు, రెన్యువల్, ఫిట్ నెస్ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలం బోరజ్ చెక్ పోస్టుల దగ్గర ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు కొనసాగుతోంది.

## పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు

మొదటి పేజీ తరువాయి

ంటున్నారనే ఆరోపణలతో పోలీస్ వ్యవస్థ పై నమ్మకం లేని పరిస్థితి నెలకొందని పేర్కొంది సుప్రీం. కొన్ని స్టేషన్‌లలో మాటల్లో చెప్పలేని ఘోరాలు కూడా జరుగుతున్నాయనే ఆరోపణలను సుప్రీం సీరియస్ గా తీసుకుంది. పీఎస్ లలో జరిగేది ప్రతీదీ పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో, సామాన్యులకు న్యాయం జరగాలనే యోచనతో పోలీస్ స్టేషన్‌లలో సీసీ కెమెరాల విషయంలో సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తీరాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఈ విషయంలో ఆయా రాష్ట్రాల సీఎస్ లు చర్యలు తీసుకోవాలని చెప్పింది. దీనికి సంబంధించి పనులు ఎంత వరకూ జరిగాయో తమకు ఎప్పటికప్పుడు తెలియజేయాలంది. పోలీస్ స్టేషన్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్ గా తీసుకోవాలని హెచ్చరించింది సుప్రీంకోర్టు.

## అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి

విచారణకు అనుమతించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ప్రధాన కేసులో తీర్పు రిజర్వ్‌లో ఉన్నందున మధ్యంతర బెయిల్ పొడిగింపు కోసం సీఎం కేజ్రీవాల్ చేసిన పిటిషన్ జాబితా చేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి తగిన నిర్ణయం తీసుకుంటారని సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ తెలిపింది. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పిటిషన్‌లో తెలిపారు అరవింద్. తాను 7 కిలోల బరువు తగ్గినట్లు చెప్పారు. కీటోన్ స్థాయిలు పెరిగాయని అందుకే తాను పీఈటీ-సీటీ స్కాన్ సహా పలు పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా తన మధ్యంతర బెయిల్ గడువును మరో 7 రోజులు పొడిగించాలని సుప్రీంను కోరారు. మే 10న జైలు నుంచి విడుదలైన తర్వాత, ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల కోసం కేజ్రీవాల్ ఇండియా బ్లాక్ కోసం ప్రచారంలో పాల్గొంటున్నారు. బెయిల్ జూన్ 1 వరకు వర్తిస్తుంది మరియు ఢిల్లీ సీఎం జూన్ 2న అధికారులకు లొంగిపోవాల్సి ఉంటుంది.

## కాకతీయ కళాతోరణంపై ఎందుకంత కోపం

మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ అనేవి రాచరికపు గుర్తులు కాదు వెయ్యేళ్ల సాంస్కృతి వైభవానికి చిహ్నాలు అని పేర్కొన్నారు. అవి వెలకట్టలేని తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలు అని కేటీఆర్ గుర్తు చేశారు. జయజయహే తెలంగాణ గీతంలో ఏముందో తెలుసా.. కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప. గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్. వీటిన్నంటిని అధికారిక గీతంలో కీర్తించి అధికారిక చిహ్నంలో మాత్రం అవమానిస్తారా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇవాళ తెలంగాణ గుర్తులు మారుస్తామంటున్నారు, రేపు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ సరిహద్దులూ చెరిపేస్తారా.. గత పదేళ్లుగా ప్రభుత్వ అధికారిక చిహ్నంపై యావత్ తెలంగాణ సమాజం ఆమోద ముద్ర ఉంది. సబ్బండ వర్ణాల మనసు గెలుచుకున్న సంతకమూ ఉంది. రాజకీయ ఆనవాళ్లను తొలగించాలన్న కక్షతో రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని చెరిపేస్తే సహించం అని కేటీఆర్ అన్నారు. పౌరుషానికి ప్రతీకైన ఓరుగల్లు సాక్షిగా మీ సంకుచిత నిర్ణయాలపై సమరశంఖం పూరిస్తాం.. తెలంగాణ సమాజాన్ని ఏకం చేసి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తాం.. అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## మెడిగడ్డలో కొనసాగుతున్న మరమ్మతు పనులు



మేడిగడ్డ, మే 28 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ ఏ విధంగా ఉందో గుర్తించేందుకుగాను భూ భౌతిక (జియో ఫిజికల్), భూ సాంకేతిక (జియో టెక్నికల్) పరీక్షలు చేయడానికి బుధవారం ఢిల్లీకి చెందిన కేంద్ర మృత్తిక, ఇతర భూపదార్థాల పరిశోధన కేంద్రం (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణుల బృందం రానుంది. ఈ మేరకు రాష్ట్ర అధికారులకు ఆ సంస్థ సోమవారం సమాచారం ఇచ్చింది. ఇప్పటిదాకా మట్టి నమూనాలు పంపిస్తే పరీక్షలు చేసి వివరాలు ఇస్తామని సంస్థ చెబుతూ వచ్చింది. అయితే అధికారులు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో నిపుణులను పంపుతోంది. మరోవైపు బ్యారేజీ ఏడో బ్లాకులోని గేటు నెంబర్ 20కి ఎదురుగా ఏర్పడిన అగాధాన్ని గ్రౌటింగ్ పద్ధతిలో పూడ్చేందుకు బోర్‌వెల్ ద్వారా హోల్స్ వేస్తున్నారు. ఈ పనులను సోమవారం బ్యారేజీ మరమ్మతుల (పునరుద్ధరణ, రక్షణ) కమిటీ చైర్మన్, రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్ పరిశీలించారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ (సీడీవోసీఈ) మోహన్‌కుమార్, కమిటీ సభ్యులతో కలిసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను అనిల్‌కుమార్ సందర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో జరుగుతున్న షీట్‌ఫైల్ ఏర్పాటు, గేట్ల తొలగింపు పనులను కూడా వీరు పరిశీలించారు. గ్రౌటింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ(ఎన్‌డీఎస్ఏ) సూచనలను పాటిస్తూ తాత్కాలిక మరమ్మతుల్లో వేగం పెంచాలని, వానాకాలం ప్రారంభమయ్యే నాటికి గేట్లన్నీ తెరిచి ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం అన్నారం బ్యారేజీని పరిశీలించారు. వానాకాలంలో బ్యారేజీలో నీటిని నిల్వ చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బ్యారేజీకి దిగువ ప్రవాహం వైపు ఉన్న లీకేజీలను, ఎగువ ప్రవాహం వైపు గేట్లు, ప్లాట్‌ఫామ్‌పై పేరుకుపోయిన ఇసుక తొలగింపు పనులను పరిశీలించారు. దీనికి ముందు కన్నెపల్లి పంప్‌హౌసను సందర్శించారు. ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసే అవకాశం ఉంటే దానిని బట్టి పంప్‌హౌసను సిద్ధంగా ఉంచాలన్నారు. పంప్‌హౌసలో మోటార్లు, డెలివరీ చానల్‌తో పాటు, అన్నారం బ్యారేజీని కలిపే గ్రావిటీ కెనాల్‌ను పరిశీలించారు.

**గ్రౌటింగ్ పనులకు సర్వం సిద్ధం**

మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7 కింద ఏర్పడిన అగాధాన్ని పూడ్చేందుకు చేపట్టనున్న గ్రౌటింగ్ పనులకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రమే ఇసుక గ్రౌటింగ్ పనులు ప్రారంభించాలని అనుకున్నప్పటికీ ఇందుకు సంబంధించిన హోల్స్ పూర్తయ్యేసరికి చీకటి కావడంతో వీలు కాలేదని సమాచారం. 20వ, 21వ పిల్లర్ల మధ్య ఉన్న గేట్ కటింగ్‌తో పాటు బ్యారేజీకి దిగువన షీట్‌ఫైల్స్ అమరిక పనులు మాత్రం కొనసాగుతున్నాయి. కాగా, గేట్ల కత్తిరింపు ప్రక్రియ పది రోజుల్లో పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు.

## ఎన్నికల కోడ్ అనంతరం మొదలవనున్న హామీల అమలు

మొదటి పేజీ తరువాయి

నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ విషయాన్ని మంత్రి ట్విట్టర్ (ఎక్స్) వేదికగా పోస్ట్ చేశారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి ప్రకటించారు. అర్హులందరికీ కొత్త పెన్షన్లు కూడా ఇస్తామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆగస్టు 15వ తేదీ లోగా రైతు రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో పాఠశాలలు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి ట్వీట్ చేశారు.

## ప్రతిపక్ష "బీఆర్ఎస్" పార్టీ గుర్తింపు రద్దు చేయాలి

మొదటి పేజీ తరువాయి

మంగళవారం రాష్ట్ర ప్రధానాధికారి కార్యాలయానికి వెళ్లి బీఆర్ఎస్ పార్టీపై ఫిర్యాదు చేశారు. ఈసీ నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసిన బీఆర్ఎస్ పార్టీపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ఇష్టారీతిన డబ్బు పంచిందని, దీనికి సంబంధించిన ఆధారాలు, అకౌంట్ వివరాలు ఈసీకి ఇచ్చామని తెలిపారు. దీనిపై విచారణ జరిపి ఆ పార్టీపై యాక్షన్ తీసుకోవాలని కోరామని చెప్పారు. రాష్ట్ర సీఈవో కార్యాలయం స్పందించకుంటే ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని రఘునందన్ రావు తేల్చి చెప్పారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ నుండి రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బీజేపీ తరుపున ప్రేమేందర్ రెడ్డి బరిలోకి దిగగా.. మే 27న ఈ ఉప ఎన్నికకు పోలింగ్ జరిగింది. జూన్ 5న ఫలితం రానుంది.

## ప్రభుత్వ పాఠశాలలు లేని గ్రామాలు 265




మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు అధికారులు రాష్ట్రంలో మూతపడ్డ పాఠశాలల వివరాలు సేకరించడంతో నిమగ్నమయ్యారు. దీనిలో భాగంగానే డిసెంబరులో విద్యాశాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశం సందర్భంగా నూతన పాఠశాలల ఏర్పాటుపై వివరాలు సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం విధితమే. ఏ ఒక్క బాలుడు గానీ, బాలిక గానీ చదువు కోసం ఇతర గ్రామాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో గత నాలుగు నెలలుగా విద్యాశాఖ అధికారులు మూసివేసిన పాఠశాలల పునరుద్ధరణకు కసరత్తులు చేస్తున్నారు.

**పాఠశాలలు లేని గ్రామాలు 265**

రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా, 265 గ్రామపంచాయతీల్లో పాఠశాలలు లేవని తేలింది. వీటిలో 206 గ్రామ పంచాయతీల్లో స్కూళ్లు అవసరమని అధికారులు గుర్తించారు. మరో 62 గ్రామాల్లో పిల్లలు లేకపోవడంతో స్కూళ్ల ఏర్పాటు అవసరం లేదని సర్కారుకు నివేదిక అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పిల్లలు లేరనే కారణంతో పాఠశాలలను మూసివేస్తే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించేందుకు మొగ్గుచూపడంపై పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే, మూతపడ్డ స్కూళ్లనూ రీఓపెన్ చేయించేందుకు సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది.

**నల్లగొండలో అత్యధిక స్కూళ్లు**

రాష్టంలో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 24 కొత్త స్కూళ్లను ప్రారంభించనున్నారు. కరీంనగర్, యాదాద్రి భువనగిరి జిల్లాలో 21 చొప్పున, వరంగల్‌లో 16 కొత్త స్కూళ్లను ప్రారంభించనున్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 14 పంచాయతీల్లో స్కూళ్లు లేవని, ఇందులో 11 గ్రామపంచాయతీల్లో కొత్త స్కూళ్లు అవసరం లేదని అధికారులు గుర్తించారు. వరంగల్ జిల్లాలో 24 జీపీల్లో స్కూళ్లు అందుబాటులో లేకపోగా, ఇందులో 12 గ్రామపంచాయతీల్లో అసలు కొత్త స్కూళ్లే అవసరం లేదని వెల్లడించారు. హైదరాబాద్, గద్వాల, మేడ్చల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలు మినహా ప్రతి జిల్లాలోనూ ఒకటి ఆపై స్కూళ్లు మూతపడ్డాయి. గ్రామాల్లో కొత్త స్కూళ్లను ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై కూడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూన్‌లో జరిగే బడిబాటలో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పిల్లలను గుర్తించి, వారికి స్కూళ్లలో అడ్మిషన్లు ఇప్పించాలని భావిస్తున్నారు. అందుబాటులో ఉన్న టీచర్లనే కొత్త స్కూళ్లలో సర్దుబాటు చేయాలని యోచిస్తున్నారు. విద్యా శాఖపై సీఎం నిర్వహించిన సమీక్షలో భాగంగా గ్రామంలో పాఠశాల ఉండాలనే నిర్ణయంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఎక్కడ పాఠశాల అవసరం? పిల్లల ఎన్ రోల్ తక్కువగా ఉండి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండి ఆ గ్రామానికి దగ్గరగా ఉంటే సదరు పాఠశాలలో ఆ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేసేలాగా కసరత్తు చేస్తున్నాం. ప్రస్తుతం 1748 పాఠశాలల్లో జీరో ఎన్ రోల్ వుంది.

## కేటీఆర్, హరీశ్ రావు ఫోన్ ట్యాపింగ్ పై విచారణను కోరరా

తెలంగాణ బ్యూరో, మే 28 (తీన్మార్ న్యూస్): అన్నింటికీ సీబీఐ విచారణ చేయించాలని కోరే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసుపై మాత్రం కోరడం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయబోదని, అలాంటి వెధవ పనులు తాము చేయబోమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం తుగ్లక్ రోడ్ 23 లో సీఎం అధికారిక నివాసం నిర్మాణ పనులు పరిశీలించిన అనంతరం మీడియాతో చిట్ చాట్ చేశారు. కనపడకుండా పోయిన హార్డ్ డిస్క్ లు, ధ్వంసం అయిన డేటా బాక్ అప్ డేటా ఎక్కడ ఉందో విచారణ అధికారులు తేల్చాల్సి ఉందన్నారు. తీవ్రవాదులు, జాతి వ్యతిరేక శక్తుల విషయంలో ఫోన్ ట్యాపింగ్ జరగొచ్చునని, గత ప్రభుత్వం దానిని దుర్వినియోగం చేసిందని చెప్పారు. తెలంగాణలో పారదర్శకంగా పాలన సాగుతోందని అన్నారు. రాష్ట్ర గేయ రూపకల్పన బాధ్యతను అందెశ్రీకే అప్పగించామని, సంగీతం సమకూర్చడం వ్యవహారాన్ని కూడా ఆయనే చూసుకుంటున్నారని చెప్పారు. ఏ సంగీత దర్శకుడిని పెట్టి గేయ రూపకల్పన చేయాలనేది తన పనికాదని అన్నారు. అందెశ్రీ ఎవరితో గేయ రూపకల్పన చేస్తారనేది ఆయన ఇష్టమని చెప్పారు. తెలంగాణ చిహ్నం రూపకల్పన నిజామాబాద్ వ్యక్తికి ఇచ్చామని అన్నారు. తెలంగాణ అంటేనే త్యాగాలు, పోరాటాలు అని సీఎం అన్నారు. వాటిని స్ఫురణకు తెచ్చేలా చిహ్నం రూపుదిద్దుకుంటోందని చెప్పారు. మేడిగడ్డపై జ్యుడిషియల్ ఎంక్వైరీ తర్వాత నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కాళేశ్వరం కరెంటు బిల్లులన్నీ సముద్రంలోకి వదిలిన నీళ్లలాంటివని, 52 టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయని అన్నారు. సముద్రంలోకి వెళ్లిన నీళ్లకూ కరెంటు బిల్లులు కట్టామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమస్య పై నిపుణుల సూచనలతో ముందుకు వెళతామని వెల్లడించారు.

## పిల్లల అక్రమ విక్రయ ముఠా గుట్టురట్టు

హైదరాబాద్, మే 28 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో పిల్లలను అక్రమంగా విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు రాచకొండ పోలీసులు. ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలను తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విక్రయిస్తున్న ముఠా అరెస్టు సంచలనంగా మారింది. 13మంది చిన్నారులను కాపాడి 11మంది నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేసినట్లు రాచకొండ సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. ఢిల్లీ, పూణే నుంచి ఏడాది లోపు ఉన్న పిల్లలను అక్రమంగా తీసుకొచ్చి రెండు తెలుగు రాష్ట్రాల్లో నిందితులు అమ్మకాలు చేశారు. సంతానం లేని వారికి ఒక్కో చిన్నారిని రూ.3.5లక్షలకు అమ్మినట్లు సీపీ తెలిపారు. 13మంది పిల్లలను కొనుగోలు చేసిన వారి నుంచి రాచకొండ పోలీసులు రెస్క్యూ చేశారు. అయితే కొనుగోలు చేసిన తల్లిదండ్రులు చిన్నారులను తిరిగి అప్పగించాలంటూ రాచకొండ సీపీ కార్యాలయం వద్ద ఆందోళన దిగారు. తాము పెంచుకోవడానికే పిల్లలను కొనుగోలు చేశామని తిరిగి అప్పగించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మేడిపల్లిలో నెల నుంచి రెండేళ్ల వయసున్న పిల్లలను అమ్ముతున్నట్లు రాచకొండ పోలీసులకు సమాచారం అందింది. పిల్లలు లేని వారికి ఢిల్లీ, పూణెల నుంచి చిన్నారులను తెచ్చి విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు చేశారు. శోభ రాణి, సలీం, స్వప్న అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిని అరెస్టు చేసిన సమయంలో 23రోజులు, నెల రోజులు ఉన్న ఇద్దరు చిన్నారులను రక్షించారు. ఈ కేసుపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టగా మానవ అక్రమ రవాణా రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు ఈ రాకెట్‌తో సంబంధం ఉన్న ఏజెంట్లు, సబ్ ఏజెంట్లు 8మందిని అరెస్టు చేసినట్లు సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. ఢిల్లీ, పూణెలో ఉన్న ముఠా సభ్యులనూ పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లు వెళ్లినట్లు సీపీ వివరించారు.

# అంజన్న భక్తులు పోటెత్తిన కొండగట్టు

### స్వామి వారి భక్తుల దీక్షలు విరమణలు..సందడిగా మారిన కొండగట్టు పుణ్యక్షేత్రం



కొండగట్టు, మే 28 (తీన్మార్ న్యూస్): కొండగట్టులో కొలువైన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఆంజనేయ స్వామికి ప్రీతికరమైన రోజు మంగళవారం. అలాగే వేసవి సెలవు రావడంతోపాటు హనుమాన్ జయంతికి ముందే స్వామి వారి భక్తులు దీక్షలు విరమిస్తున్నారు. దీంతో కొండగట్టు ఆలయం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. ఆ క్రమంలో భక్తులతో క్యూ కాంప్లెక్స్‌లు నిండిపోయాయి. భక్తుల జై శ్రీరామ నినాదాలతో కొండగట్టు ప్రాంతం మార్మోగుతుంది. ఇక భక్తుల రద్దీతో కొండగట్టులో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు భక్తుల రద్దీ దృష్ట్యా బుధవారం నుంచి ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు దేవాలయం అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

## ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపుపై స్పందించిన మంత్రి సీతక్క

- ఎవరి మీదా అనుమానం లేదని మంత్రి సీతక్క స్పష్టం



హైదరాబాద్, మే 28 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు కాల్ రావడం కలకలం రేపింది. అక్కడ బాంబు ఉన్నట్లు ఓ అగంతకుడు నేరుగా కంట్రోల్ రూమ్‌కే ఫోన్ చేశాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్‌తో కలిసి వెంటనే తనిఖీలు ప్రారంభించారు. చివరకు ఇది ఆకతాయిలు చేసిన పనిగా నిర్ధారించారు. తాజాగా ఈ ఘటనపై మంత్రి సీతక్క స్పందించారు. రోజూ ప్రజాభవన్‌కు సమస్యలు చెప్పుకోవడానికి అనేకమంది వస్తుంటారు. అందరినీ లోపలికి అనుమతిస్తున్నాం. ఈ క్రమంలో బాంబు ఉందని అగంతకులు ఫోన్ చేసి అందరినీ భయభ్రాం తులకు గురిచేశారు. ప్రస్తుతం ప్రజాభవన్ లోపక చెకింగ్ నడుస్తోంది. తమకు ఎవరి మీదా అనుమానం లేదు అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేసీఆర్ ప్రస్తావన

మొదటి పేజీ తరువాయి

మహేంద్రును పరిచయం చేశారని, మద్యం వ్యాపారం వివరాలను సమీర్‌ను అడిగి కేసీఆర్ తెలుసుకున్నారు. అని ఈడీ వివరించింది. కేసీఆర్‌తో భేటీ వివరాలను గోపీ కుమరన్ వాంగ్మూలంలో రికార్డు చేసినట్లు వెల్లడించింది. కవిత రెండేళ్లలో సుమారు 11 మొబైల్ ఫోన్లు వాడారని, నాలుగు ఫోన్లలో ఉన్న ఆధారాలను కవిత ధ్వంసం చేశారని, అందువల్ల కవితకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, సాక్ష్యాలను తారుమారు చేస్తారని దర్యాప్తు సంస్థ వాదించింది. అయితే కవిత బెయిల్ పిటిషన్లపై వాదనలు ముగియగా హైకోర్టు జడ్జి స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వ్ చేశారు. ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ కేసు మరోవైపు లిక్కర్ స్కామ్ కేసు ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేసీఆర్ పేరు ఈడీ ప్రస్తావించడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఇదే సమయంలో ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ సూత్రధారి కేసీఆరే అని టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు స్టేట్‌మెంట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. లిక్కర్ కేసులో కవిత ప్రస్తావనతో కేసీఆర్ అప్‌సెట్ అయ్యారని, అందుకే కవితను తప్పించేందుకు బీజేపీ కీలక నేత బీఎల్ సంతోష్‌ను అరెస్ట్ చేసేందుకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఆ మేరకు ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో గులాబీ బాస్ స్కెచ్ కూడా వేశారనే రాధాకిషన్‌రావు తన స్టేట్‌మెంట్ ఇచ్చారనే చర్చ జరుగుతున్నది. ఇటువంటి తరుణంలో అనూహ్యంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేసీఆర్ పేరు తెరపైకి రావడంతో రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు రేపాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉచ్చు బిగిసే పరిస్థితులు ఏర్పడుతుండగా లిక్కర్ స్కామ్ వ్యవహారం గులాబీ బాస్ పొలిటికల్ కెరీర్‌లో ఎలాంటి మలుపునకు దారి తీస్తుందో అనే చర్చ జరుగుతోంది.

## సోనియా గాంధీతో సీఎం రేవంత్ ప్రత్యేక భేటీ

మొదటి పేజీ తరువాయి

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న దశాబ్ధి ఉత్సవాలకు రావాలని సోనియాగాంధీని ఆయన కోరారు. దీంతో పాటుగా ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ఇటీవల ముగిసిన లోక్ సభ ఎన్నికల పోలింగ్ సరళిపై ఆమెతో డిస్కస్ చేసినట్లు టాక్. సోనియాతో భేటీ ముగిసిన అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రావాలని సోనియాను ఆహ్వానించానని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఆమెను చీఫ్ గెస్ట్‌గా పిలవాలని ఇప్పటికే తెలంగాణ కేబినెట్ తీర్మానించిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడంపై సోనియా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేసిన ఉద్యమకారులను, అమరుల కుటుంబాలను ఈ వేడుకలకు ఆహ్వానిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు.

## నేటి నుండి గురుకులాల్లో పీఈటీ పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

**జూన్ 4వరకు రెండు సెషన్లలో వంద మంది చొప్పున వెరిఫికేషన్**

హైదరాబాద్, మే 28 (తీన్మార్ న్యూస్): గురుకులాల్లో పీఈటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. జూన్ 4వరకు రోజూ రెండు సెషన్లలో వంద మంది చొప్పున వెరిఫికేషన్ కొనసాగుతుందని వెల్లడించింది. వివరాలకు తమ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# కుదుపుల నుంచి గుణపాఠాలు

లండన్ నుంచి సింగపూర్ వెళుతున్న సింగపూర్ ఎయిర్ లైన్స్ మిగిల్చిన భీకర కుదుపుల నుంచి ప్రపంచ విమానయాన సంస్థలు అనేక గుణపాఠాలు నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. సంస్థలే కాకుండా ప్రయాణికులు కూడా ప్రయాణ సమయంలో మరిన్ని ప్రాణరక్షక చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని కుదుపులు తేల్చిచెబుతున్నాయి. సింగపూర్ ఎయిర్ లైన్స్ లండన్ నుంచి బయలుదేరి సింగపూర్‌కు చేరుకునే సమయంలో మధ్యలో అకస్మాత్తుగా సంభవించిన భారీ కుదుపులకు 73 ఏళ్ళ గియోఫ్రీ కిచెన్ అనే బ్రిటన్ ప్రయాణికుడు మరణించగా, మరో 20 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విమానాల్లో ప్రయాణించే వారిని భయాందోళనలకు గురి చేసింది. విమాన ప్రయాణాల్లో ప్రయాణికుల భద్రతపై అనేక సందేహాలను లేవనెత్తింది. కుదుపులకు దారి తీసిన కారణాలు, దీనితో విమానమే ఛిద్రమై అనేక మంది రక్తగాయాలతో అత్యవసరంగా బ్యాంకాక్‌లో విమానం ల్యాండ్ అయిన దృశ్యాలు ప్రయాణికుల మనసులను అల్లకల్లోలం చేశాయి. కుదుపులు ఇలాంటి ప్రమాదాలు మిగులుస్తాయా అని అంతా ఆందోళన పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విమానం ఇంతగా కుదుపులకు గురి కావడానికి ప్రాథమిక కారణాలను విమాన భద్రతా నిపుణులు ఇప్పటికే తేల్చివేశారు. విమానాలు 37000 అడుగుల పైన ఆకాశంలో ప్రయాణించే సమయంలో అప్పుడప్పుడు మంచు, తుఫాను గాలుల కారణంగా కుదుపులు ఏర్పడతాయి. ఇవి ఒక్కో సారి భీకరంగా ఉంటాయి. ఇలాంటి కుదుపులు సంభవించినప్పుడు పైలెట్లు హెచ్చరిక సంకేతాలు ప్రకటిస్తుంటారు. సీటు బెల్ట్ ధరించాలనే సిగ్నల్ లైట్ కూడా ప్రతి సీటుకు ఇస్తుంటారు. ఆ సమయంలో ప్రయాణికులు సీటు బెల్ట్‌ను కదలకుండా ఉండేలా బిగించుకోవాలి. విమానం బయలుదేరేటప్పుడు, విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేటప్పుడు సీటు బెల్ట్ ధరించమని చెబుతారు. ఎందుకంటే ల్యాండింగ్ టైమ్‌లో విమాన వేగం అనంతంగా ఉంటుంది. అప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోకుంటే సీటు ముందు భాగానికి తగలవచ్చు లేదంటే క్యాబిన్ హెడ్‌కు తల తగలవచ్చు. ఫలితంగా ప్రయాణికులు గాయాల పాలయ్యే ప్రమాదం ఉంది. ఇదే కాకుండా ప్రయాణ మార్గంలో వాతావరణంలో మార్పుల కారణంగా విమానం కుదుపులకు గురి కావచ్చు. పైలెట్లు వెదర్ రాడార్లో కనిపెట్టి 'కుదుపులున్నాయి సీటు బెల్ట్‌ను పెట్టుకోండి' అని హెచ్చరికలు చేస్తుంటారు. తద్వారా చిన్న, పెద్ద కుదుపుల నుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడుతుంటారు. కాని సింగపూర్ ఎయిర్ లైన్స్‌కు ఎదురైన కుదుపులు అరుదైనవని విమాన భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఇలాంటివి ఎక్కడైనా జరగవచ్చని, ప్రయాణికులు ప్రయాణమంతా అప్రమత్తంగా ఉండడమే శ్రేయస్కరమని విమానాల అటెండెంట్ల అంతర్జాతీయ అధ్యక్షుడు సారా నెల్సన్ అంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 50 వేల విమానాలు, 20 ప్రముఖ ఎయిర్ లైన్స్‌తో కూడిన సంస్థకు నెల్సన్ అధ్యక్షుడిగా ఉండి సింగపూర్ ఎయిర్ లైన్స్ ప్రమాదం గురించి ప్రయాణికులకు అనేక సూచనలు ఇచ్చారు. సింగపూర్ ఎయిర్ లైన్స్‌కు ఎదురైన 'క్లియర్ ఎయిర్ టర్బులెన్స్' అనేది అత్యంత ప్రమాదకరమైందని నెల్సన్ అన్నారు. ఇది వెదర్ రాడార్‌లో పైలెట్‌కు కనిపించదని, ఇలాంటి అరుదైన కుదుపులను కనిపెట్టే టెక్నాలజీ ఇంకా లేదని ఆయన అన్నారు. గతంలో మార్చి నెలలో బోయింగ్ 787 అనే భారీ విమానం కూడా ఇలాంటి అరుదైన కుదుపులకు గురై 50 మంది గాయాల పాలయ్యారని, ఇలాంటి అదృశ్య కుదుపుల ప్రమాదాలు మునుముందు కూడా ఎదురు కావచ్చని ఆయన హెచ్చరించారు.

అట్లాగని ప్రయాణికులు 15 నుంచి 24 గంటలు సుదీర్ఘంగా ప్రయాణించే సమయంలో మొత్తం సమయం సీటు బెల్ట్ ఎలా పెట్టుకుంటారనే ప్రశ్నలకు నెల్సన్ నుంచి సమాధానం లేదు. అయితే విమాన భద్రతా నిపుణులు ఆంధోని బ్రిక్ హౌజ్ ఒక పరిష్కారం సూచిస్తున్నారు. ఇది అందరూ పాటిస్తే కొంత మేరకైనా నష్టాన్ని నివారించే అవకాశముంది. అదృశ్య కుదుపులను కనిపెట్టే అవకాశం పైలెట్లకు లేనప్పుడు అప్రమత్తంగా ఉండే ప్రయాణికులే విమానం కుదుపులకు గురవుతుందని గ్రహించగానే సీటు బెల్ట్‌లు పెట్టుకోవాలని, ఆ సమయంలో విమానం లోపలా టాయిలెట్లకో, ఇతరత్రా అవసరాల కోసమే తిరగడం మానేయాలని ఆయన సూచిస్తున్నారు. దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా విమాన యానం అనివార్యమైన ప్రస్తుత పరిస్థితుల్లో సగటు ప్రయాణికులు కుదుపుల నుంచి రక్షించుకోవడానికి పై సూచనలు పాటించడం మినహా మరో మార్గం లేదు.

# దమ్మాయిగూడలో... దొంగల హల్చల్

**– ఊరెళ్ళి వెళ్ళేచ్చేసరికి... ఇంట్లో వస్తువుల అపహరణ**

**– 10 తులాల బంగారం, కొంతమేర వెండి, నగదు ఎత్తుకెళ్ళిన దొంగలు**



జవహార్ నగర్, మే 28(తీన్మార్ న్యూస్): సిద్దిపేటలోని బంధువుల ఇంటికి వర్ధంతి కార్యక్రమానికి వెళ్ళి ఇంటికి వచ్చే సరికి ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి దమ్మాయిగూడలో చోటుచేసుకుంది. డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడ సాయిసిద్ధార్థ కాలనీలో మంగిలిపల్లి రవీందర్, భార్య, కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. జీహెచ్ఎంసీలో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నెల 27న సిద్దిపేటలో వర్ధంతి కార్యక్రమం ఉండగా కుటుంబ సభ్యులతో కలసి వెళ్ళారు. మరుసటి రోజు 28న 7 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి కనిపించాయి. ఇంట్లోకి వెళ్ళి చూసేసరికి బీరువ తెరిచి వస్తువులన్ని చిందరవందరగా పడేసి ఉన్నాయి. గుర్తు తెలియని దొంగలు పడ్డారని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వెళ్ళిన పోలీసులు ఫింగర్ ప్రింట్స్ తీసుకుని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. 10తులాల బంగారం, కొంతమేర వెండి, నగదు ఎత్తుకెళ్ళినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కుర్రారం లో ఎల్లమ్మ ఉత్సవాలు







రాజాపేట, మే 28(తీన్మార్ న్యూస్): మండలంలోని కుర్రారం గ్రామంలో హరిజనుల వాడలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు వివంత డెవలపర్స్ అధినేత రియల్ ఎస్టేట్ చైర్మన్ పాండవుల వాణి - భాను ప్రకాష్ గౌడ్ దంపతుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయం లో మంగళవారం ఎల్లమ్మ పండుగ ఉత్సవాలు భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాను వాణి దంపతులు అమ్మవారికి ఆ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పుట్ట గమ్మొట, ఎల్లమ్మ కళ్యాణం, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పాల్గొని మొక్కులు చెల్లించుకొని చల్లంగా దీవించు తల్లి అని వేడుకున్నారు.

# తెలుగుజాతి గర్వించగల మహోన్నత వ్యక్తి.. ఎన్టీఆర్



చిట్యాల, మే 28(తీన్మార్ న్యూస్): తెలుగుజాతి గర్వించగల మహోన్నత వ్యక్తి నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) అని తెలుగుదేశం పార్టీ గుండ్రాంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల వెంకటేశం గౌడ్, సీనియర్ నాయకుడు సీమ లింగయ్యలు అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పద్మశ్రీ, స్వర్గీయ నందమూరి తారకరామారావు 101వ జయంతి వేడుకలను చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ అవసరాలను గుర్తించి సమాజమే దేవాలయం, ప్రజలే నా దేవుళ్ళు అన్న మాటను త్రికరణ శుద్ధిగా నమ్మి తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలలకే అధికారం చేపట్టి, వెనుకబడిన కులాలలో రాజకీయ స్ఫూర్తిని రగిలించిన మహనీయుడు ఎన్టీఆర్ అని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశాడని తెలిపారు. సమ సమాజ స్థాపనకు పునాది వేసి వారికి రిజర్వేషన్లు కల్పించి, గెలిపించి, పదవులను కట్టబెట్టిన ప్రజా నాయకుడు అని పేర్కొన్నారు. ప్రజల వద్దకే పాలన కోసం రెవెన్యూ మండలాలు, మండల పరిషత్ లను ఏర్పాటు చేశారన్నారు. ఆడపిల్లలకు ఆస్తిలో సగం వాటా, పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, పక్కా ఇళ్లు, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, రాజకీయాల్లో ఉన్నత స్థానాలను కల్పించాడని వివరించారు. పేదల అభ్యున్నతి, సంక్షేమమే పరమావధి అని చాటిన అభ్యుదయవాది ఎన్టీఆర్ తెలుగు జాతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, అభిమానులు బొడిగె విజయ్ కుమార్, బండ అంజయ్య, చెరుకు స్వామి, గోపగోని నర్సింహా, బుస్సు మధుసూధన్, మండలోజు శ్రీనివాసచారి, రాచకొండ వెంకటేశం, మస్కు వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# సవరమ్మ జాతర వేడుకలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే



ఆత్మకూర్, మే 28(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్ల, అమరచింత పట్టణ కేంద్రంలోని సవరమ్మ జాతర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ గీత సెల్ డిపార్ట్మెంట్ కేశం నాగరాజ్ గౌడ్ పాల్గొని సవరమ్మ ఆలయం దర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తులసిరాజ్ యాదవ్, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మండల అధ్యక్షులు రహమతుల, పట్టణ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు, అమరచింత పట్టణ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ గోప్యతను కాపాడాలి

**– సిబ్బందికి సూచనలు చేసిన జిల్లా కలెక్టర్**

**– హనుమంతు కే. జండగే**





భువనగిరి జిల్లా ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూస్): కౌంటింగ్ గోప్యతను కాపాడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంత్ కె.జెండగే కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికలకు సంబంధించి జూన్ 4 వ తేదీన స్థానిక ఆరోరా ఇంజనీరింగ్ కాలేజీలో కౌంటింగ్ పురస్కరించుకొని మంగళవారం నాడు కలెక్టరేటు కాన్ఫరెన్స్ హాలులో ఉదయం పూట తుంగతుర్తి, మునుగోడు, ఇబ్రహింపట్నం అసెంబ్లీ సెగ్మెంట్లు, మధ్యాహ్నం భువనగిరి, ఆలేరు, నకిరేకల్, జనగాం అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్ ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టరు వారితో మాట్లాడుతూ కౌంటింగ్ విధులలో కౌంటింగ్ గోప్యతను కాపాడాలని, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలని, నిష్పక్షపాతంగా, పారదర్శకతతో కౌంటింగ్ విధులు నిర్వహించాలని సూచించారు. తిరిగి జూన్ 2 న రెండవ విడత శిక్షణ ఉంటుందని తెలిపారు.



కౌంటింగ్ కేంద్రంలో అన్ని వసతులు కల్పించడం జరిగిందని, కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6.00 గంటలకు తమకు కేటాయించిన టేబుళ్ల వద్ద సిద్దంగా ఉండాలని, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఇవిఎం యంత్రాల సీల్ తీయాలని, పోలైన ఓట్లను అభ్యర్ధి వారిగా ప్రదర్శించాలని, పోలైన ఓట్ల వివరాలను సరిగా నమోదు చేయాలని, పూర్తి అప్రమత్తతతో పారదర్శకంగా కౌంటింగ్ విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాధరెడ్డి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి



ఆత్మకూర్, మే 28(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం, తిప్పడంపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున్ తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. మల్లికార్జున్ వృత్తిరీత్యా ప్రింటింగ్ ప్రెస్ నడుపుతూ జీవనం సాగించేవాడు, మంగళవారం రోజు తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడు మల్లికార్జున కు భార్య,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**– జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగే ఆదేశాలు జారీ**



భువనగిరి జిల్లా ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూస్): జిల్లాలో పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే ఆదేశించారు. వచ్చే జూన్ 3 వ తేది నుండి 11వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, వేసవి దృష్ట్యా విద్యార్థుల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయానుకూలంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. విద్యార్థులకు తగిన వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి కే.నారాయణరెడ్డి నివేదిక ప్రకారం జిల్లాలో అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు గాను 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లాలో మొత్తం 1,070 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, సిట్టింగ్ స్క్వాడ్స్ నియమించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలములో చేరుకోవాలని సూచించారు.

# వీసీ నియామకాలపై విచారణ చేయాలి

హైదరాబాద్: వీసీ నియామకంలో జరుగుతున్న అవకతవకలు పై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ అన్నారు. ఈ అంశంపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రికి వినతి పత్రం ఇచ్చారు. ఇంజనీరింగ్ కళాశాలలో బ్యాక్ డోర్ ద్వారా సీట్లను లక్షలకు అమ్ముకుంటున్నారు. ఇలీగల్గా సీట్లను అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మంత్రి మండలి సొంత మనుషులను, దోస్తులను విసీలుగా నియమిస్తున్నారు. బీసీ ఏర్పాట్లకు కోట్లలో పార్టీ ఫండ్ ఇవ్వాలని ప్రచారం జరుగుతుంది. సీనియార్టీ ప్రకారం నిజాయితీగా నిస్వార్ధంగా పనిచేసేవారిని వీసీలుగా నియమించాలి. బీ కేటగిరిలను ప్రభుత్వం అడ్డుకట్టవేయాలి. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడతామని అన్నారు.

# పంట సాగు పై రైతులకు అవగాహన



ఆత్మకూర్, మే 28((తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలం, పిన్నంచర్ల,గుంటిపల్లి, రేచింతల గ్రామాలలో వనపర్తి జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆత్మకూర్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని రైతులకు విత్తన కొనుగోలులో రైతుల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడిఏ కే దామోదర్ మాట్లాడుతూ లూజుగా ఉన్న సంచుల్లో విత్తనాలను కొనుగోలు చేయరాదని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తన ప్యాకెట్ మరియు బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్, ఏఈఓ కే.మహేశ్వరి, కే.శివకుమార్, సింధుజ మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహారంలో నాణ్యత లోపిస్తే తగిన చర్యలు

**- కమిషనర్ జి. రాజేంద్ర కుమార్**

**- ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు**



కీసర, మే 28(తీన్మార్ న్యూస్): హెూటల్లో, రెస్టారెంట్లలో విక్రయించే ఆహారంలో నాణ్యత లోపిస్తే తగు చర్యలు తప్పవని, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలని మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని హెూటల్స్, రెస్టారెంట్లను ఆకస్మికంగా ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. నాగారం మున్సిపాలిటీలో కుళ్లిపోయి, క్వాలిటీ లోపించిన ఆహార పదార్థాలు వాడుతున్నటువంటి హెూటళ్లు, రెస్టారెంట్లకు మొత్తం రూ. 45 వేలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె.చంద్రశేఖర్, సానిటరీ ఇన్స్పెక్టర్ డి.రామ్ రెడ్డి, లైసెన్స్ ఇన్స్పెక్టర్ ధర్మారెడ్డి, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సురవరం ప్రతాప్ రెడ్డి జయంతి వేడుకలు

**- పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి**



వనపర్తి ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూస్): సురవరం ప్రతాపరెడ్డి గారి జయంతి వేడుకలు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు డాక్టర్ జిల్లెల.చిన్నారెడ్డి మాట్లాడుతూ, బహుముఖ ప్రజ్ఞాశాలి, వనపర్తి మొట్ట మొదటి శాసన సభ్యులు సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ రాజకీయ, సాంస్కృతికంగా, పత్రిక సంపాదకుడిగా పేరు గడించిన వ్యక్తి ఇంత గొప్ప నాయకుని మనం వారిని స్మరించుకుంటూ వారి ఆశయాలను కొనసాగించాలి అని కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, వారి ఆశయాలను కొనసాగిస్తూ, వారు చేసిన సేవలను స్మరించుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చీర్ల జనార్ధన్, రాగి వేణు, మండల అధ్యక్షులు నారాయణ, ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, సి.పెంటన్న యాదవ్, విజయకుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దివాకర్, సేవాదళ్ జానకి రాములు, ఎం డి బాబా, హనీస్, అబ్దుల్లా, జానంపేట నాగరాజు, మెంటేపల్లి రాములు,ఎల్లయ్య, సురేష్ గౌడ్, సహదేవుడు, కృపాకరరెడ్డి, గడ్డం వినోద్, నరసింహ, చంద్రశేఖర్, బాలరాజు, నవీన్, నాగార్జున, ఎన్ ఎస్ యూ ఐ చరణ్, రవి, కార్తీక్, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ కు నివాళులు అర్పించిన జిల్లా ఎస్పి రక్షిత కే మూర్తి

**- పోలీస్ లాంచానాలతో అంత్యక్రియలు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో డీసీఆర్బి విభాగంలో విధులు నిర్వహిస్తూ (ఆదివారం) రోజున గుండెపోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ (హెచ్ సి.నెం1918) కుటుంబానికి మంగళవారం రోజు వనపర్తి జిల్లా వనపర్తి పట్టణం పాత బజార్ పోచమ్మ గుడి చెందిన కె.ఆనంద్ మృతి చెందిన పార్థిహ దేహానికి వనపర్తి జిల్లా ఎస్ పి.రక్షిత కే మూర్తి ఐపీఎస్, తన చేతుల మీదుగా పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అంత్యక్రియ ఖర్చులకు గాను రూ.20000/- నగదును అందజేశారు. పోలీస్ సంక్షేమ విభాగం నుండి ఈ నగదును వారి కుటుంబానికి అందజేసినట్టు గా జిల్లా ఎస్ పి. రక్షిత కే మూర్తి తెలియజేశారు. మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.ఆనంద్ సతీమణి రత్న మాలను వనపర్తి జిల్లా ఎస్ పి.రక్షిత కే మూర్తి ఐపీఎస్ ఓదారుస్తూ, తనకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలియజేసినారు. ఎస్ పి.రక్షిత కే మూర్తి ఐపీఎస్ ప్రసంగిస్తూ, పోలీసు శాఖలో పనిచేసే అధికారులు. మరియు సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని కోరారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాలకు జిల్లా పోలీస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. చిత్రంలో వనపర్తి జిల్లా ఎస్ పి. రక్షిత కే మూర్తి ఐపీఎస్. వనపర్తి డిఎస్పి జె. వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పి కృష్ణ కిషోర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటయ్య, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# యూనిఫామ్ లు నాణ్యతగా కుట్టాలి

**- జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ సంఘవార్**



వనపర్తి ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూస్): ఆకస్మికంగా పెద్ద మందడి మండలం లోని అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను మరియు విద్యార్థులకు సంబందించిన యూనిఫామ్ స్టిచ్చింగ్ కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ సంఘవార్ సందర్శించారు. ముందుగా మణిగిల్ల గ్రామంలో విద్యార్థుల కు సంబంధించిన యూనిఫామ్ స్టిచ్చింగ్ కేంద్రాలను సందర్శించారు. జూన్ మెదటి వారంలోగా యూనిఫామ్ విద్యార్థులకు అందివ్వాలని మహిళా సమాఖ్య వారిని ఆదేశించారు. స్టిచ్చింగ్ నాణ్యత గా ఉండాలని సూచించారు. మండలంలో మూడు గ్రామంలో మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్ జరుగుతుంది. మణిగిల్ల, పెద్దమందడి



మరియు పామిరెడ్డి పల్లి గ్రామాల్లో గ్రామ మహిళ సమాఖ్య వారు స్టిచ్చింగ్ చేస్తున్నారు. ప్రస్తుతము 2670 గురు విద్యార్థులకు యూనిఫామ్ వచ్చింది. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా మండలంలోని సివిల్ వర్క్స్ కు, కరెంట్, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్ వసతులకు కు సంబంధించి జరుగుతున్నా పనులను పరిశీలించారు. పీస్ చిలకటోనిపల్లి , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెలటూర్, పీస్ వెలటూర్, ఎంహెచ్పీఎస్ గట్లఖానాపూర్, పిఎస్ చేకురుచేట్టు తండా సందర్శించారు. పనులను త్వరిత గతిన చేయాలని సంబంధిత ఏజెన్సీ లకు ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభించే లోగా పూర్తి చేయాలనీ సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిని వైయస్ సద్గుణ నాగమణి, రాజేష్, ఎంపీఓ శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ న్యూస్ ఎఫెక్ట్

## అనుమతులు లేని ప్రైవేట్ ఆస్పత్రులు సీజ్





**- ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి**

**- నిబంధనలు పాటించని ఆస్పత్రుల సీజ్**

**- రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**

**- పరిధి దాటితే క్రిమినల్ కేసులు**

**- వనపర్తి జిల్లా డీఎంహెచ్వో శ్రీనివాసులు**


హద్దు మీరుతున్న ఆర్ఎంపీల వైద్యం
వైద్యం.. వ్యాపారం

దేవరకద్ర ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూస్): ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని, అనుమతులు లేకుంటే సీజ్ చేస్తామని వనపర్తి జిల్లా డీఎంహెచ్వో శ్రీనివాసులు అన్నారు. రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వనపర్తి జిల్లా వైద్యాధికారులకు సమాచారం అందడంతో కలెక్టర్ అదే శానుసారం మేరకు వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో ఈశ్వర్ క్లినిక్ నిబంధనలు పాటించని ఆస్పత్రుల సీజ్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లినిక్లు, నర్సింగ్హెూంల పనితీరులను పరిశీలిస్తున్నాంమని, అర్హత గల వైద్యులు ఉన్నారా, పరికరాలు, మందులు ఉన్నాయా, నర్సింగ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బంది, ఇతర సిబ్బంది అనువజ్ఞులేనా వంటి అంశాలను తనిఖీ చేసినామని తెలిపారు. లోపం ఉన్న వాటిని సీజ్ చేస్తున్నట్లు, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ లేకపోతే సీజ్, అనుమతులు తీసుకోని, నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకుంటాం అన్నారు. అనేకచోట్ల ఆర్ఎంపీలులు స్వయంగా ఇంజక్షన్లు చేయటం, సెలైన్లు ఎక్కిస్తుండటంతో పాటు.. స్టెరాయిడ్లు, యాంటీ బయోటిక్ మందులను సైతం వాడాల్సిందిగా రోగులకు సిఫార్సు చేస్తున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని కోరారు. పరిధి దాటి పనిచేస్తున్న వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టేందుకు సైతం వెనకాడబోమని స్పష్టం చేశారు. పలువురు వైద్యులు ఎంబీబీఎస్ బోర్డులు పెట్టుకుని చికిత్స అందిస్తున్నట్టు తమ తనిఖీల్లో తేలిందన్న ఆయన అర్హత లేకుండా ఎవరు రోగులకు చికిత్స అందించినా సహించేది లేదని హెచ్చరించారు. వైద్యసేవల్లో నాణ్యత, రోగులకు కల్పించాల్సిన పూర్తిస్థాయి సౌకర్యాలు రిజిస్ట్రేషన్ వివరాలు సర్టిఫికెట్తో పొందుపరచాలన్నారు. అనుమతి లేని మందుల దుకాణం నిర్వహణ, రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం, రికార్డులు సరిగా లేకపోయినా ఏపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదన్నారు.







# ఊర చెరువు నుండి అక్రమంగా మట్టి తరలింపు

**- విచారణ చేపట్టిన ఐబి, పోలీసు అధికారులు**





రాజాపేట,మే 28(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం, నమిల రెవెన్యూ గ్రామ పరిధిలోని ఐబీ పరిధిలోని ఊర చెరువులో వందలాది ట్రిప్పుల మట్టిని అక్రమంగా తొలగించారు. పోలీసు ఐబి అధికారులకు వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం సంఘటన స్థలం వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. సమీప రైతు తన పొలంలోకి మట్టిని తరలించుకునేందుకు చెరువులో మట్టిని తీసినట్లు వారి ప్రాథమిక విచారణలో తేలింది ఎలాంటి అనుమతి లేకుండా చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉండేలామట్టిని ఇష్టం వచ్చినట్లు తొలగించారని, ఈ విషయంపై ఐబీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ అనుమానాలు రేకెత్తాల ప్రవర్తిస్తున్నారని రైతులు ఆరోపించారు. ఐబీ అధికారులపై మొదటి ముద్దాయిలుగాభావించి కేసులు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# కౌంటింగ్ నిర్వహణ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**- ఆదేశాలు జారీ చేసిన జిల్లాల యంత్రాంగానికి ప్రధాన ఎన్నికల అధికారి**

**- వికాస్ రాజ్**




భువనగిరి జిల్లా ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూస్): కౌంటింగ్ నిర్వహణ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. మంగళవారం నాడు కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి పార్లమెంటు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ జూన్ 4వ తేదీన పార్లమెంటు నియోజకవ ర్గాల ఓట్ల లెక్కింపు సందర్భంగా చేపట్టాల్సిన చర్యల గురించి ఆయన పలు సూచనలు చేశారు. ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందిని కేటాయించాలని, కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటల వరకు అందరూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు చేరుకునేలా చూడాలని, ఈ మేరకు అభ్యర్థులు, వారి తరఫున హాజరయ్యే ఏజెంట్లకు కూడా సమాచారం అందించాలని సూచించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ప్రారంభించాలని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన అన్ని సదుపాయాలు కౌంటింగ్ సెంటర్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శిక్షణ తరగతుల సందర్భంగా స్పష్టమైన అవగాహన కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పూర్తి పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన వివరాలను రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించే సమయంలో తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జండగే, డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్లు పి.బెన్ షాలోమ్, కే.గంగాధర్, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# రాకేష్ రెడ్డి గెలుపు ఖాయం

## - గుంటి మధుసూదన్ రెడ్డి



రాజాపేట, మే 28(తీన్మార్ న్యూస్): ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి గెలుపు ఖాయమని తాజా మాజీ సర్పంచ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజాపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ప్రకారం టిఆర్ఎస్ అభ్యర్థి గెలవనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. ప్రధానంగా ముగ్గురు అభ్యర్థులలో రాకేష్ రెడ్డి ఎమ్మెల్సీ కి అర్హుడని పట్టభద్రులైన ఓటర్లు రాకేష్ రెడ్డికే పట్టం కట్టనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధుల ఫోరం అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, ఎస్.సి. సెల్ జిల్లా నాయకులు ఎర్రగోకల జస్వంత్, బూర్గు నర్సిరెడ్డి, రామచంద్రారెడ్డి, గౌరయ్య తదితరులున్నారు.

# ఫర్టిలైజర్ షాపులపై తనిఖీలు





ఆత్మకూర్, మే 28(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల కేంద్రంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడిఏ దామోదర్ మండల వ్యవసాయ శాఖ అధికారి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్, మహేశ్వరి ట్రేడర్స్, ఆగ్రో సేవా కేంద్రం, జయలక్ష్మి ట్రేడర్స్, సంకల్ప రిటైల్ స్టోర్స్, వినాయక ట్రేడర్స్, శ్రీ లక్ష్మీనరసింహ ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాపులను వారు తనిఖీ నిర్వహించారు. విత్తన నిల్వలను స్టాక్ రిజిస్టర్, బిల్ రసీదులను పరిశీలించారు. రైతులకు తప్పనిసరిగా విత్తన విక్రయ రసీదు బిల్లులు ఇవ్వాలని సూచించారు. కల్తీ, నకిలీ విత్తనాలు అమ్మిన ఎడల లైసెన్స్ రద్దు చేస్తామని ఫర్టిలైజర్స్ షాప్ యజమానులకు అధికారులు తెలియజేశారు.

# కొడుకులాగా... కన్న రుణం తీర్చుకున్న కూతురు



రామన్నపేట, మే 28(తీన్మార్ న్యూస్): మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన కోణాల కిష్టయ్య అనే వ్యక్తి మంగళవారం నాడు మరణించారు. ఇతనికి ముగ్గురు కూతుర్లు పెద్దకూతురు నాగలక్ష్మి, రెండవ కూతురు మమత, చిన్న కూతురు అన్నపూర్ణ లు, కిష్టయ్య కి కొడుకులు లేని కారణంగా కొడుకులాగ కన్న రుణం తీర్చుకోవడం కోసం చిన్న కూతురు ముందు నడిచి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

# ప్రతి రైతు మట్టి నమూనా పరీక్షలు నిర్వహించుకోవాలి

**కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పిల్లి కిరణ్**

కమాన్ పూర్ . ప్రతి రైతు మట్టి నమూనా పరీక్షలు నిర్వహించుకోవాలని రామగిరి ఖిలా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పిల్లి కిరణ్ అన్నారు. మంగళవారం డాక్టర్ కిరణ్ పిల్లి భూసార పరీక్ష ప్రాముఖ్యత మరియు ఆవశ్యకత గురించి కమాన్ పూర్ మండలం నాగారం గ్రామంలో భూసార పరీక్షకు మట్టి నమూనాసేకరించే విధానం పై అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ, ప్రతి రైతు తమ నేల యొక్క భూసారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలి అని,తద్వారా ఎరువుల వాడకంలో అనవసర ఖర్చులు తగ్గించి భూసారాన్ని కాపాడుకుంటూ అదిక మరియు సుస్థిరదిగుబడులు పొందవచ్చని. భూసార పరీక్షలు చేయడంద్వారా పోషకాల పరిమాణం కాకుండా భూమిలోనిచౌడు, సున్నం శాతాన్ని గుర్తించవచ్చని, రైతులు తమపొలంలోని మట్టిని సేకరించి కృషి విజ్ఞాన కేంద్రం –రామగిరిఖిల్లా కి పంపించినట్లు అయితే రైతులకు భూసార పరీక్ష చేసి భూ ఆరోగ్య పత్రాలు అందజేస్తామనితెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మట్టి నమూనా ఎలా సేకరించాలి మరియు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి రైతులకు వివరించారు. మట్టి నమూనాలు సేకరించే విధానానికి8001804016 నెంబర్ కి కాల్ చేసి తెలుసుకోవచ్చునిఅన్నారు.


# అకడమిక్ క్యాలెండర్ రెడీ

హైదరాబాద్,: వేసవి సెలవులు ముగుస్తున్నాయి. మరో రెండు వారాల్లో స్కూళ్లు తెరచుకోనున్నాయి. జూన్12 నుంచి స్కూళ్లు రీఓపెన్ చేయనున్నట్టు విద్యాశాఖ ప్రకటించింది. ఈ లోపు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనుంది. జూన్ 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ 11 రోజుల పాటు కార్యక్రమాన్ని జరపనున్నారు. అంతేకాదు.. 2024?25 అకడమిక్ ఇయర్ క్యాలెండర్‌ను కూడా విద్యాశాఖ రిలీజ్ చేసింది.వచ్చే ఏడాది 229 రోజులు వర్కింగ్ డేస్ నిర్ణయించారు. అక్టోబర్ 2 నుంచి 13 (అక్టోబర్ 2 నుంచి 14 వరకు) రోజుల పాటు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుంచి ఐదు రోజుల క్రిస్మస్ సెలవులు, జనవరి 13 నుంచి ఐదు రోజుల సంక్రాంతికి సెలవులు ఫిక్స్ చేశారు. ఇక ప్రతీ రోజూ స్టూడెంట్స్‌తో ఐదు నిమిషాలు యోగా, మెడిటేషన్ నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. దీంతో పాటు.. ప్రతీ నెల మూడో శనివారం నో బ్యాగ్ డే అమలు చేయనున్నారు. నెలకు ఒక నో బ్యాగ్ డే చొప్పున ఏడాదికి 10 రోజులు అమలు చేస్తారు. ఇక జనవరి 10 నాటికి టెన్త్ సిలబస్ పూర్తి చేసేలా షెడ్యూల్ రిలీజ్ చేశారు. ఆ తర్వాత విద్యార్థులకు ప్రిపరేషన్, రివిజన్, ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ కండక్ట్ చేస్తారు. మిగిలిన క్లాసులకు ఫిబ్రవరి 28 నాటికి సిలబస్ కంప్లీట్ చేసేలా క్యాలెండర్ రిలీజ్ చేశారు. స్టూడెంట్స్ అటెండెన్స్ పడిపోకుండా టీచర్స్ జాగ్రత్తలు తీసుకోవాలని విద్యాశాఖ సూచించింది. ప్రతీ స్కూల్‌లోనూ 90శాతం మందికిపైగా విద్యార్థులు హాజరు ఉండాలని స్పష్టం చేసింది. తరుచూ స్కూలుకు డుమ్మా కొడుతున్న విద్యార్థులపై స్పెషల్ ఫోకస్ చేయాలని తెలిపింది. అలాంటి విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించింది.ప్రతి రోజూ అరగంట పాటు రీడింగ్ యాక్టివిటీకి టైం ఇవ్వాలని విద్యాశాఖ ఆదేశించింది.స్కూల్ బుక్స్‌తో పాటు స్టోరీ బుక్స్, న్యూస్ పేపర్లు, మ్యాగజైన్లను చదివించాలని క్యాలెండర్ లో స్పష్టం చేసింది. దీంతో పాటు.. రెగ్యూలర్‌గా హెల్త్ చెకప్లను చేయించాలని అకాడమిక్ క్యాలెండర్‌లో తెలిపారు. ఏటా రెండుసార్లు పిల్లలకు కచ్చితంగా హెల్త్ చెకప్ చేయించాలని ఆదేశించారు.

# సంతానోత్పత్తిపై ప్రభావం చూపే మైక్రోప్లాస్టిక్

## - ఒక గ్రామ్ కణజాలంలో 329.44 మైక్రోగ్రాముల మేర మైక్రోప్లాస్టిక్

## - పురుష సంతానోత్పత్తిపై ప్రభావం లి న్యూ మెక్సికో వర్సిటీ అధ్యయనం



హైదరాబాద్, మే 28 : మైక్రోప్లాస్టిక్ కారణంగా పురుష సంతానోత్పత్తిపై ప్రభావం చూపే ప్రమాదమున్నదని పరిశోధకుడు జియోజంగ్ యూ పేర్కొన్నారు. పురుషుడి సంతానోత్పత్తికి కీలకమైన వృషణాల్లోనూ మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు యూనివర్సిటీ ఆఫ్ న్యూ మెక్సికో పరిశోధకులు తెలిపారు. మగ కుక్కలు, పురుషులపై ఈ అధ్యయనం చేసినట్టు పేర్కొన్నారు. కుక్కలతో పోలిస్తే పురుషుల వృషణాల్లో మూడు రెట్లు ఎక్కువగా మైక్రోప్లాస్టిక్ ఉన్నట్టు గుర్తించామన్నారు. వృషణాల్లో 12 రకాల మైక్రోప్లాస్టిక్ రేణువులను కనుగొన్నామని.. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, బ్యాగ్స్ తయారీకి వాడే పాలీఇథైలీన్ (పీఈ), పాలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) కూడా ఇందులో ఉన్నట్టు వెల్లడించారు.ఒక్క వృషణాల్లోనే కాదు మనుషుల రక్తం, గుండె, ఆఖరికి గర్భిణుల మావిలో (పిండం) కూడా మైక్రోప్లాస్టిక్ అవశేషాలను కనుగొన్నట్టు పరిశోధకులు వెల్లడించారు. 62 మంది గర్భిణుల మావి నమూనాలను పరీక్షిస్తే.. ప్రతీ గ్రాము కణజాలంలో 6.5 నుంచి 790 మైక్రోగ్రాముల మేర మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు వివరించారు.పురుషులలో 329.44 మైక్రోగ్రాములు కుక్కలలో 122.63 మైక్రోగ్రాములు ఉన్నట్లు గుర్తించారు.

# నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




**రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్**

రామగుండం : అధికారులకు, సిబ్బంది కి అవగాహన కార్యక్రమం. నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని రామగుండం కమిషనర్ ఎం. శ్రీనివాస్- ఐజి అన్నారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు 2023 అమలులోకి తేనున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. దానిలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించేలా రామగుండం పోలీస్ కమిషనరేట్ లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని రామగుండం కమిషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్ కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలి తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు చేర్పులు చేశారు అన్నారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదనీ, అవసరాన్ని బట్టి ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. ఇప్పుడు అమలులోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం వంటి అంశాలతో శాంతిభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తోంద న్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కొరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. ఇంతకాలం పాటిస్తున్న పాత విధానాలలో నూతన చట్టాలకు విరుద్ధమైన వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ పాటించకూడదని, నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాలని చేయాల్సి ఉంటుందని సీపీ సూచించారు.కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులకు, సిబ్బంది కి తెలంగాణ పోలీస్ అకాడమీ లో నూతన చట్టలపై శిక్షణ పొందిన అధికారులతో బ్యాచ్ ల వారిగా నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని సీపీ తెలిపారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్,సిసి అర్బీ ఇన్స్పెక్టర్ బుద్దె స్వామి, కమిషనరేట్ పరిధిలోని సీఐ, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# భయపెడుతున్న రెస్టారెంట్లు

హైదరాబాద్: వీకెండ్స్ ఫుడ్ ని ఎంజాయ్ చేసేందుకు కొందరు రెస్టారెంట్లకు వెళ్తారు. ఇలా రెస్టారెంట్లకు వెళ్లే భోజన ప్రియులకు మాత్రం ఊహించిన షాక్ కి గురి అవుతున్నారు. హైదరాబాద్ మహానగరంలోని కొన్ని రెస్టారెంట్లో సీటు దొరకాలంటే కనీసం గంట నుంచి రెండు గంటల పాటు వేచి చూడాల్సినా పరిస్థితి..!అయితే ప్రస్తుతం అంతటి రద్దీ ఇప్పుడు కనిపించడం లేదు భాగ్యనగరంలో రెస్టారెంట్లు. సమయం, సందర్భం లేకుండా ఐస్ క్రీములు, కేక్స్ లాగించే యువత తమ అలవాటును కొనసాగించడానికి భయపడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహిస్తున్న వరుస రైడ్స్‌లో.. ఫుడ్‌లవర్స్‌కే కాదు, సాధారణ జనాలకూ దిమ్మ తిరిగిపోయేలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా.. చాలా హోటెల్స్‌లో కుళ్లిన పదార్థాలతో ఆహారాన్ని సిద్ధం చేస్తున్నారని నిర్ధారించారు తనిఖీ అధికారులు. కనీస శుభ్రత పాటించకుండా? రోజుల తరబడి స్టోర్‌చేసిన మాంసాన్ని.. వేడివేడిగా వడ్డిస్తూ.. జనాల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నట్టు తేల్చారు. ఇప్పటికే పలువురు బాధితులు.. తమకు అనారోగ్య స్థితికి కారణమైన హోటెల్స్‌పై కేసులు కూడా నమోదు చేశారు.గల్లీకో హోటెల్? రోడ్డుకో రెస్టారెంట్? విచ్చలవిడిగా వెలుస్తున్న ఫుడ్‌సెంటర్లు.. దీంతో విపరీతమైన కాంపిటీషన్ ఏర్పడింది. ఎలాగైనా సక్సెస్ కావాలని.. లాభాలబాట పట్టాలని.. కొన్ని హోటెల్స్ వికృతచేష్టలకు దిగుతున్నాయి. ఆహారం మిగిలితే పారేయకుండా.. స్టోరేజ్‌చేసి తర్వాతి రోజుకూడా కస్టమర్లకు వడ్డిస్తున్నారు. వాడిన నూనెలనే మళ్లీమళ్లీ వాడుతూ.. ఘోరమైన తప్పిదం చేస్తున్నారు. అయితే, ఆలస్యంగా మేల్కొన్న ఫుడ్ సేఫ్టీ అధికారులు? ఇప్పుడు వరుస దాడులతో హడలెత్తిస్తున్నారు. హోటెల్సన్నీ ఈూఎ రూల్స్ పాటించాలని చెబుతున్నారు.కుళ్లిన ఆహారం తిని అనారోగ్యం పాలవుతున్నవారు.. ఆస్పత్రులకు భారీ సంఖ్యలో వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అపరిశుభ్రత, ప్రాసెస్ ఫుడ్, స్టోర్డ్ ఫుడ్‌ల కారణంగానే.. కడుపునొప్పి, లూస్ మోషన్స్.. మలంలో రక్తం రావడం.. నీరసించిపోవడం.. వంటి అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రైడ్స్‌తో హైదరాబాద్‌లోని రెస్టారెంట్ల నిర్వాహకులంతా అప్రమత్తమయ్యారు. హోటెల్స్ యజమానులందరూ? ఈూఎ రూల్స్ పాటించాలని సూచిస్తున్నారు. నగరవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా అధికారులు రెస్టారెంట్లపై నిర్వహిస్తున్న దాడుల్లో బయటపడుతున్న విషయాలు దీనికి కారణం అని తెలుస్తోంది.పేరు గొప్ప ఊరు దిబ్బ అంటే ఇదేనేమో.. బయట అంత కళ్ళు చెదిరేలా కలరింగ్, కానీ లోపల అంత కంపే.. రెస్టారెంట్లు, ఐస్‌క్రీం పార్లర్, సూపర్ మార్కెట్లు.. ఒకటేమిటి కాదేది కల్తీకి అనర్హం.. కాదేది ఆరోగ్య కారకం అన్నట్టుగా నగరంలో పరిస్థితి దిగజారిందని తాజాగా అధికారుల దాడుల్లో వెల్లడైంది. హైదరాబాద్ మహా నగరంలో ఫుడ్ లవర్స్ కి ఫేవరెట్ బిర్యానీ సెంటర్లో, బ్రాండెడ్ ఐస్ క్రీమ్ పార్లర్లు.. సైతం ప్రమాణాలు పాటించడంలో దారుణంగా వెనుకబడి ఉన్నాయని తెలిసింది. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుస దాడులతో హడలెత్తిస్తున్నారు. ఒక్కో రెస్టారెంట్ అసలు భాగోతాన్ని బయటపెడు తున్నారు. ఈ దాడుల్లో సోషల్ మీడియాలో హైలెట్ అయ్యాయి. మరోవైపు కల్తీ ఉత్పత్తులు నిల్వ ఆహార పదార్థాలకు సంబంధించిన ఫోటోలు వీడియోలు సంబంధిత యాజమాన్యాలను ప్రశ్నిస్తూ నెటిజన్లు పోస్టులు పెట్టారు. ఈ క్రమంలోనే లకిడికాపూల్‌లోని ద్వారక హోటల్లో క్యారెట్ హల్వా తిన్న ఓ కస్టమర్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈ వార్త తీవ్ర సంచలనం సృష్టించింది. ఇలా ఒకదాని తర్వాత ఒకటి ఏదోక ఇన్సిడెంట్ జరుగుతూనే ఉంది. ప్రస్తుతం బయట ఆహారం అంటేనే నగరవాసులు భయపడుతున్నారు. దీనికి గత మూడు రోజులుగా అధికారులు రెస్టారెంట్లపై చేస్తున్న రైడ్స్ ఏ కారణం అంటున్నారు.జీజీహెచ్ఎంసీతో కలిసి రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు రెస్టారెంట్లపై దాడులు చేశారు. మాసబ్ ట్యాంక్‌లోని పారడైజ్ బిర్యానీ సెంటర్, అస్లీ హైదరాబాద్ ఖానా వంటి ప్రముఖ రెస్టారెంట్లలో నిర్వహించిన దాడుల్లో ఇంతటి ఫుడ్ కలర్ ఆహారాన్ని గుర్తించారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా కిచెన్లను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఎక్కడా నిబంధనలు పాటించలేదని అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా సాగిన దాడుల్లో 100కి పైగా రెస్టారెంట్లు ఫుడ్ జాయింట్స్ పై తనిఖీలు చేసి అసలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంలో తిండి అంటేనే భయపడుతున్నారు భోజనప్రియులు.

# కాశీకి కాషాయదళం...

హైదరాబాద్: దేశంలో సార్వత్రిక సమరం తుది అంకానికి చేరుకుంది. జూన్ 1న ఏడో విడత పోలింగ్ అతిపెద్ద ఓట్ల పండుగ ముగియనుంది. ఇక జూన్ 4న ఫలితాల కోసం నిరీక్షణ కొనసాగుతోంది. తెలంగాణ లోక్ సభలో ఎన్నికలు ముగిసిన తర్వాత బీజేపీ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు, ఎమ్మెల్సీ బై పోల్ కూడా నేటితో పూర్తి కావడంతో ఇక సార్వత్రిక ఎన్నికల మిగిలిన చివరి విడత పోలింగ్ ప్రచారానికి టీ బీజేపీ నేతలు సైతం సై అంటున్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ పోటీ చేస్తున్న వారణాసికి తెలంగాణ కమలనాథులు క్యూ కట్టారు. కొద్దిమంది నేతలు ఇప్పటికే ఓ రౌండ్ ప్రచారం చేసి వస్తే.. మిగిలిన నేతలు నాలుగు రోజుల ప్రచారానికి పయనమయ్యారు.సోమవారం బీజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మల్కాజ్ గిరి బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ వారణాసి బయలుదేరి వెళ్లారు. ప్రధాని మోడీ వరుసగా మూడోసారి వారణాసి నుంచి లోక్ సభ బరిలో దిగారు. ఆయనకు మద్ధతుగా ప్రచారం చేసేందుకు తెలంగాణ నుంచి నేతలు పయనమయ్యారు. ఆరో విడత ఎన్నికల ప్రక్రియ ముగియడంతో చివరి విడత ఎన్నికల ప్రచారం ఇప్పటికే జోరందుకుంది. ఆయా లోక్ సభ స్థానాల్లో అగ్రనేతల ప్రచారాలు కొనసాగుతున్నాయి. మంగళవారం బీజెఎల్పీ నేత మహేశ్వర రెడ్డి సహా మరికొంతమంది రాష్ట్ర నేతలు వారణాసి చేరుకుంటారు. మోడీకి మద్ధతుగా అక్కడి ఓటర్లను కలవనున్నారు. పదేళ్ల మోడీ పాలనే దేశమంతా బిజెపిని గెలిపిస్తుందని.. వారణాసిలో మోదీ హవాను ప్రత్యక్షంగా చూసేందుకు వెళ్తున్నామని ఈటల అన్నారు.తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ముగిసిన వెంటనే బిజెపి రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ వారణాసి వెళ్లి ప్రచారంలో పాల్గొన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ వెనక్కి వచ్చినా.. యూపీ నుంచి రాజ్యసభ మెంబర్?గా ఉన్న లక్ష్మణ్ మళ్లీ వెళ్లి అక్కడే ప్రచారంలో నిమగ్నమయ్యారు. బండి సంజయ్ వారణాసిలో స్థిరపడిన తెలుగువారితో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి బిజెపికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ నెల 30 సాయంత్రం 5 గంటలకు వరకు అక్కడ ప్రచారం ముగియనుంది. అప్పటివరకు తెలంగాణ బిజెపి నేతలు స్థానికులతో కలిసి ప్రచారం నిర్వహించనున్నారు. తుది అంకానికి చేరిన సార్వత్రిక ఎన్నికల సమరంలో వారణాసిలో ఫినిషింగ్ టచ్ ఇవ్వబోతున్నారు. స్వామి కార్యం.. స్వకార్యం రెండు కలిసి వచ్చినట్లు.. ప్రచారానికి వెళ్లిన నేతలంతా కాశీ విశ్వనాథుని దర్శనం చేసుకుని బిజెపి విజయంతో పాటు తెలంగాణలో తమ గెలుపును ఖాయం చేయాలని ప్రార్థిస్తున్నారు.

# మరో ఏడాది పాటు గుట్కా నిషేధం

హైదరాబాద్, మే 28: రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యానికి హానికరమైన గుట్కాను నిషేధించాలని నిర్ణయించింది. ఈ మేరకు గుట్కా తయారీ, అమ్మకాలను నిషేధిస్తూ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24 నుంచి ఏడాది కాలం పాటు వీటిపై నిషేధం, నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు.. గుట్కా, పాన్ మసాలాల్లో ఉండడంతో వాటిని నిషేధించినట్లు ఉత్తర్వులు పేర్కొన్నారు. నిబంధనలు మీరి గుట్కా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటు, రాష్ట్రంలోని పలు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అపరిశుభ్రత, నిల్వ ఉంచిన ఆహారం గుర్తించి ఆయా హోటళ్ల నిర్వాహకులపై చర్యలు చేపట్టారు.అటు, కరీంనగర్‌లోని పలు హోటళ్లపైనా ఆదివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. వరంగల్ నుంచి వచ్చిన టాస్క్ ఫోర్స్ సేఫ్టీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీతో పాటు.. పలువురు అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. ఆకస్మికంగా చేసిన దాడులతో.. ఒక్కసారిగా హోటల్స్ యాజమాన్యాలు బెంబేలెత్తాయి. మిరియాల పేరుతో పుప్పొడి గింజలను వేస్తున్నట్టు గుర్తించారు. 2021- 22 సమయంలోని ఇన్ గ్రేడియంట్స్‌ను మసాలాలుగా వాడుతుండటం గుర్తించిన అధికారులు షాకయ్యారు. కల్తీ నూనెలు, కాలం చెల్లిన వంట సామాగ్రి, మసాలాలు గుర్తించి హోటల్ యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

# మైనర్ డ్రైవింగ్ నెంబరు ప్లేట్లులేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్

సిద్దిపేట : ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జనవరి నుండి ఈరోజు వరకు నమోదు చేసిన కేసులు వివరాలు, మైనర్ డ్రైవింగ్ పై ఈరోజు వరకు 554 కేసులు డ్రైవింగ్ చేసిన వారిపై, వాహన యజమానులపై కేసులు నమోదు చేయడం జరిగింది. నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై 628 కేసులు నమోదు చేయడం,త్రిబుల్ రైడింగ్ పై కేసులు 2510 నమోదు చేయడం జరిగింది. సెల్ఫోన్ డ్రైవింగ్ పై కేసులు 2200 నమోదు చేయడం జరిగింది.తల్లిదండ్రులు వాహన యజమానులు సరదాల గురించి పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం దుఃఖసాగరంలో మునిగిపోతుందని తెలిపారు. సరదా ఎప్పుడు కూడా విషాదంగా మిగల వద్దన్నారు. ప్రతి వాహనదారుడు రవాణా శాఖ ఉత్తర్వుల మేరకు నెంబర్ ప్లేట్ వాహనాలకు బిగించుకోవాలి, తరచుగా నెంబరు ప్లేట్ లేని వాహనాల చోదకులు వేగంగా నడుపుతూ తోటి వాహదారులను, పాదాచారులను, భయబ్రాంతులకు గురిచేస్తున్నందున నంబరు ప్లేట్లులేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు, మరియు మోటార్ సైకిల్ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనదారులు అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడుపుతునందున్న ప్రమాదం జరిగే అవకాశం ఉందని, నెంబర్ ప్లేట్ నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మోటార్ సైకిల్ పై ముగ్గురు ప్రయాణించ వద్దని, వాహనం నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ వెంబడి ఉంచుకోవాలని త్రిబుల్ రైడింగ్, మరియు రాష్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని, హెల్మెట్ మా శాసనం కాదు మీ సంక్షేమం, హెల్మెట్ ఒక వస్తువు కాదు ప్రాణాన్ని కాపాడే ఆయుధం, రోడ్ చిన్నదైనా పెద్దదైన, పడితే ప్రమాదమే ఆదమరిస్తే విషాదమైన ఎక్కడైనా ఎప్పుడైనా చిన్నవారైన పెద్దవారైనా ప్రమాదం పొంచి ఉన్నదని ఎవరికెరుక అందుకే ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రజలందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. నెంబర్ సరిగ్గా లేని వాహనాల పై కొంతమంది నేరస్తులు బండ్లపైన వచ్చి దొంగతనాలు చేయడం, చట్టవ్యతిరేకమైన కార్యక్రమా లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వినయ్ సాగర్, ట్రాఫిక్ ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ గురి

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌పై గురి పెట్టింది కాంగ్రెస్ పార్టీ. బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు వన్ బై వన్ హస్తం గూటికి క్యూ కడుతున్నారు. ఏకంగా ఓరుగల్లు మేయర్ కూడా అదే రూట్‌లో ఉన్నారన్న ప్రచారంతో అలర్ట్ అవుతోంది గులాబీ పార్టీ. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ లిస్టులో ఇంకా ఎంతమందున్నారు? గ్రేటర్ కుర్చీకి కాంగ్రెస్ ఎంత దూరంలో ఉంది? కుర్చీలాటలో బీఆర్ఎస్ పట్టు నిలుస్తుందా? కాంగ్రెస్ ఎత్తు ఫలిస్తుందా? ఇదే ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న చర్చ. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి.. కానీ వరంగల్ లో మాత్రం పొలిటికల్ హీట్ చల్ల బడడం లేదు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవిశ్వాసం తీర్మానంపై హాట్ హాట్ చర్చ జరుగుతుంది. మేయర్ కుర్చీలో కూర్చోబెట్టిన వారే ఇప్పుడు కుర్చీ దింపడానికి కసరత్తు చేస్తున్నారట. ఓరుగల్లు మేయర్ పై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ముఖ్యనేతలు, కార్పొరేటర్లు మేయర్ గుండు సుధా రాణి పై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు, కార్పొరేటర్లు భేటీ అయి మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టే విషయంపై చర్చ జరిపారు. వారికి కలిసివచ్చే పార్టీలు, ఇతర పార్టీల కార్పొరేటర్ల మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారట..ఓరుగల్లు మేయర్ పై హటాత్తుగా ఎందుకు అవిశ్వాసం ప్రవేశపెట్టాలని కసరత్తు చేస్తున్నారు..? ఆమెను మేయర్ పీఠంపై కూర్చోబెట్టిన బీఆర్ఎస్ పార్టే ఇప్పుడు ఆమెను గద్దే దింపేందుకు ఎందుకు కసరత్తు చేస్తుందనే అనుమానం కలుగుతుంది కదూ..? అవునూ బీఆర్ఎస్ పార్టే మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు ఉవ్విళ్ళూరుతోంద. ఆ పార్టీ నుండి గెలుపొంది గ్రేటర్ వరంగల్ మేయర్ పీఠం కైవసం చేసుకున్న గుండు సుధారాణి ఈ మధ్య కాలంలో కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో మేయర్ పై ఆగ్రహంతో ఊగిపోతున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు సిద్ధమైనట్లు చర్చ జరుగుతుంది. ఐతే ఎవరి బలమెంతా..? అవిశ్వాసం పెడితే తగ్గేదెవరూ..? నెగ్గేదేవరూ..? అనే చర్చ జరుగుతుంది. ఉచిఓఅలో మొత్తం 66 డివిజన్లు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరిన కొత్త ? పాత కార్పొరేటర్లతో కలుపుకుని కాంగ్రెస్ సభ్యుల సంఖ్యా బలం 34కు చేరింది. 10మంది బీజేపీ,22 మంది బీఆర్ఎస్ సభ్యులుగా కొనసాగుతున్నారు. అలాగే బీఆర్ఎస్ తరుపున నలుగురు ఎమ్మెల్సీలు ఉన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు సంపూర్ణ మద్దతు తెలిపితే మేయర్ కుర్చీకి ఎలాంటి ముప్పు ఉండదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్లు మేయర్ పై గుర్రుగా ఉన్నారు. ఆ ఎనిమిది మంది బీఆర్ఎస్ పార్టీ పెట్టే అవిశ్వాసానికి మద్దతు తెలిపితే మేయర్ కుర్చీకి గండం తప్పేలా లేదు. ఈ నేపథ్యంలోనే మేయర్ ను గద్దె దించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఇవ్విళ్ళూరుతోంది. అయితే, సరిపడ సభ్యుల మద్దతు లేకుండా అవిశ్వాసం ప్రవేశపెడితే నెగ్గేదెవరూ..? అవిశ్వాసం వేగిపోతుందా..? లేదా కాంగ్రెస్ లోని ఒక వర్గం మద్దతుతో మేయర్ కుర్చీకి ఎసరు పెడతారా.? అనే చర్చ జరుగుతుంది.

# వైరల్ ఫీవర్ తో ఉన్నా...

హైదరాబాద్: బెంగళూరు రేవ్ పార్టీ కేసులో సినీ నటి హేమ పోలీసుల విచారణకు హాజరుకాలేనని గళూరు సీసీబీ పోలీసులకు లేఖ రాశారు. తన రేవ్ పార్టీలో లేనని వీడియో రిలీజ్ చేసిన నటి హేమకు బెంగుళూరు పోలీసులు షాక్ ఇచ్చారు ఆమె ఫోటోలను విడుదల చేశారు.సోమవారం జరిగే విచారణకు హాజరు కావాల్సి ఉండగా తాను వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నట్లు హేమ బెంగుళూరు పోలీసులకు లేఖరాశారు. సీసీబీ ఎదుట హాజరయ్యేందుకు కొంత సమయం కావాలని కోరారు. దీంతో మరోసారి హేమకు నోటీసులు ఇచ్చేందుకు బెంగులూరు సీసీబీ పోలీసులు సిద్ధమయ్యారు. నేడు జరిగే విచారణకు హాజరుకావాలంటూ గతంలోనే హేమకు పోలీసులు నోటీసులు ఇచ్చారు.బెంగళూరు రేవ్ పార్టీ కేసులో నటి హేమతో సహా 8 మందిని విచారణకు హాజరు కావాలని పోలీసులు ఆదేశించారు. ఈ కేసులో అరెస్టై, జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించేందుకు పోలీసులు నేడు కోర్టులో పిటిషన్ వేయనున్నారు. రేవ్ పార్టీలో 103 మంది పాల్గొనగా 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు ఇప్పటికే తేల్చారురేవ్ పార్టీ జరిగిన సమయంలో నటి హేమ పేరు బయటకు రావడంతో ఆ రోజు తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని, హైదరాబాద్‌లో చిల్ అవుతున్నానని చెప్పుకొచ్చారు. తాజాగా విడుదల చేసిన మనం తప్పు చేయనంత వరకు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, తప్పు చేసినా పొరపాటు జరిగినా సారీ చెప్పొచ్చని, అబద్దం చెబితే దానిని కవర్ చేయడానికి 100 అబద్దాలు చెప్పాల్సి వస్తుందని అందుకే అబద్దాలు చెప్పకుండా ఉండటం మేలంటూ మరో వీడియోని పోస్ట్ చేశారు. మనసులో ఏమి పెట్టుకోకూడదని, తప్పు చేయనంత వరకు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదంటూ పోస్ట్ చేశారు. ఆ పోస్ట్ కాసేపట్లోనే డిలీట్ చేశారు.రేవ్ పార్టీలో నటి హేమ కూడా పోలీసులకు దొరికారు. కానీ తాను రేవ్ పార్టీకి వెళ్లలేదని, హైదరాబాద్‌లోనే ఉన్నానంటూ హేమ ఓ వీడియోను విడుదలచేసి తప్పించుకునే ప్రయత్నం చేసింది. హేమ రేవ్ పార్టీలో పాల్గొన్నట్లు కర్ణాటక పోలీసులు ధృవీకరించారు. తొలుత ఆమె పేరును కృష్ణవేణిగా నమోదు చేశారు.బెంగుళూరులో జరిగిన రేవ్ పార్టీలో పాల్గోన్న వారిలో చాలామంది



డ్రగ్స్ వినియోగించినట్టు పోలీసులు గుర్తించారు. మొత్తం 156మందిని ఫాం హౌస్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో 109మంది డ్రగ్స్ వినియోగించినట్టు రక్త పరీక్షల్లో తేలింది. వీరిలో 59మంది పురుషులు, 27మంది మహిళలు ఉన్నారు. పార్టీలో పాల్గొన్న వారిలో సినీ నటి హేమ కూడా ఉన్నారు. హేమ.. కృష్ణవేణి పేరుతో రేవ్ పార్టీలో పాల్గొన్నట్టు బెంగుళూరు పోలీసులు స్పష్టం చేశారు. ఆమె కూడా మాదక ద్రవ్యాలను వినియోగించినట్టు నిర్ధారించారు.బెంగుళూరులో సన్‌సెట్ టూ సన్ రైజ్ పేరిట నిర్వహించిన పార్టీలో దాదాపు 200మంది పాల్గొన్నారు. వీరిలో ప్రధాన నిందితులు నలుగురు మినహా మిగిలిన వారిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఒక్కొక్కరి నుంచి పార్టీలో పాల్గొనడానికి రూ. 2లక్షలు వసూలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. రక్త పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిని విచారించనున్నారు.

**ఏం జరిగిందంటే?**

బెంగుళూరులో గత సోమవారం తెల్లవారు జాము వరకు జరిగిన రేవ్ పార్టీని స్థానిక పోలీసులు భగ్నం చేశారు. కాన్‌కర్డ్ ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీపై దాడి చేసిన పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో విజయవాడకు చెందిన క్రికెట్ బుకీ లంకపల్లి వాసు పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, సినీ నటులు మాజరైనట్టు పోలీసులు గుర్తించారు.

# పదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తవుతోంది. రాష్ట్ర విభజన 2014లోనే జరిగినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా పదేళ్ల పాటు హైదరాబాద్ కొనసాగింది. ఉమ్మడి గడువు మరో నాలుగు రోజుల్లో పూర్తి కానుంది. విభజన సమయంలో హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన భవనాలు జూన్ 2 తరువాత తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. దీంతో ఇక నుంచి హైదరాబాద్‌తో ఏపికి ఎటువంటి అధికారిక, పరిపాలన సంబంధం ఉండదు. హైదరాబాదులో ఉండే భవనాలకు సంబంధించిన వివరాలతో కూడా నివేదిక తయారు చేయాలని గతంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు కూడా. ఇటీవలి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన భవనాల స్వాధీనంపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై మే 20న జరిగిన తెలంగాణ మంత్రి వర్గ భేటీలో చర్చించారు. అంతకు ముందే ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల విభజనపై నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్, అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు పెండింగ్ అంశాలపై పరిష్కారానికి కార్యాచరణ తయారు చేసి అధికారులు అందజేశారు. రెండు రాష్ట్రాల సయోధ్యతో ఉద్యోగుల బదిలీ సమస్యను పరిష్కరించాలన్నారు సీఎం రేవంత్, క్లిష్టమైన అంశాలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు. జూన్ తర్వాత ఏపీ ఆధీనంలోని లేక్ వ్యూ గెస్ట్ హౌజ్ వంటి భవనాలను స్వాధీనం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అయితే తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న ఉమ్మడి ఒప్పందం ముగింపు దశకు చేరుకున్నప్పటికీ, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లోని సంస్థలు, ఫిల్మ్ డెవలప్‌మెంట్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎన్‌టిపిసి, ఆర్‌టిసి, సింగరేణి, ఆస్తుల పంపకానికి సంబంధించిన అంశాలు కొలిక్కి రాలేదు. ఇటీవల ఢిల్లీలో ఉన్న ఏపి భవన్ పంపకం అయింది. విభజన చట్టం నోడల్ ఏజెన్సీగా ఉన్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏపి, తెలంగాణ రాష్ట్రాల అధికారులతో చర్చించినప్పటికీ పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. అయితే ఢిల్లీలో ఉన్న ఏపి భవన్, భూమి పంపకంపై రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశం ఇంకా పూర్తి కాకపోవడంతో ఇప్పటికీ ఉద్యోగులు అటు హైదరాబాద్, ఇటు విజయవాడ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల కొన్ని కార్యాలయాలను న్యాయ రాజధాని పిలవబడే కర్నూల్ కు మార్చినప్ప టికీ ఆర్థిక పరమైన అంశాలపై స్పష్టత రాలేదు. అయితే ఇటీవలి రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ఫలితాలు జూన్ 4న రానున్నాయి. ఆ తరువాత కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. అయితే ఎన్నికల ఫలితాలకు ముందే, జూన్ 2నే రెండు రాష్ట్రాలకు మధ్య ఉన్న ఉమ్మడి ఒప్పందం ముగుస్తుంది. ఏపి, తెలంగాణ మధ్య విద్యుత్ బకాయిలు, ఉద్యోగుల కేటాయింపు పెండింగ్‌లో ఉంది. మరోవైపు ఎపికి చెందిన ఉద్యోగులు తెలంగాణలో 1,200 మంది వరకూ ఉన్నారు. ఏపి నుండి తెలంగాణకు వెళ్లాల్సిన ఉద్యోగులు 1,600 మందికిపైగా ఉన్నారు. విద్యుత్ ఉద్యోగుల కేటాయింపుపై సుప్రీంకోర్టు కూడా తీర్పు ఇచ్చింది. కాని పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఉద్యోగుల కేటాయింపుపై రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరుగుతుందనే సందర్భాలలో తెలంగాణ ప్రభుత్వం వెనకడుగు వేసింది. దీనివల్ల ఉద్యోగాలు కేటాయింపు కూడా మధ్యలోనే ఆగిపోయింది. విద్యుత్ బకాయిలకు సంబంధించి రూ. 8 వేల కోట్లు తెలంగాణ ప్రభుత్వం ఏపికి ఇవ్వల్సి ఉంది. అయితే ఈ అంశం కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. విద్యుత్ బకాయిలు ఇప్పించాలనిఏపి సిఎం జగన్మోహన్ రెడ్డి, గత సిఎం కేంద్రానికి విజ్ఞప్తులు చేసిన ఫలితం లేదు. కేంద్ర ప్రభుత్వంపూర్తిగాతేల్చకుండా మధ్యలోనే వదిలేసింది.

# టీపీసీసీ ఎవరికి దక్కేనో...?

హైదరాబాద్: తెలంగాణలో టీపీసీసీ పదవి రేసులో చాలా మంది నేతలు అధిష్టానం వద్ద క్యూ కడుతున్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు టీపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో టీపీసీసీ అధ్యక్ష పదవిపై చాలా మంది నేతలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. మొన్నటి వరకు తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో టీపీసీసీ చీఫ్ గా సీఎం రేవంత్ రెడ్డినే కొనసాగించింది కాంగ్రెస్ అధిష్టానం. పైగా పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలకు గానూ 14 నియోజకవర్గాల్లో విజయం సాధించాలని టార్గెట్ ఇచ్చినట్లు వార్తలు వినిపించాయి. దీంతో అన్నీతానై ప్రచార బాధ్యతలు నిర్వహించారు సీఎం రేవంత్ రెడ్డి. ఇక ఆ ఎన్నికలు ముగిసి 10 రోజులు గడిచిపోయింది. ఎన్నికల ఫలితాలు కూడా జూన్ 4న రానున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుని పదవీ బాధ్యతల నుంచి సీఎం రేవంత్ నిష్క్రమించే అవకాశం ఉంది. ఇకపై కేవలం పరిపాలనా సంబంధిత విషయాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఖాళీ అయ్యే పదవి రేసులో అరడజనుకు పైగా నేతలపేర్లు వినిపిస్తున్నాయి. ముందుగా డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టి విక్రమార్క కూడా టీపీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో కర్ణాటక ఎన్నికల్లో ముఖ్యమంత్రి పదవి సిద్దరామయ్యకు కేటాయించే తరుణంలో డిప్యూటీ సీఎంతో పాటు కర్ణాటక అధ్యక్షుని పదవీ బాధ్యతలు కూడా డీకే శివకుమార్?కు కేటాయించిన సందర్భాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే ఈ పదవిపై జగ్గారెడ్డి కూడా గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఆయన ఇప్పటికే ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన తరుణంలో ఏదైనా పార్టీ బాధ్యతలు కేటాయించాలన ఆశగా ఉన్నారు. అందులో భాగంగానే ఈ అధ్యక్ష్యపదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ జాబితాలో వినిపిస్తున్న మరో పేరు పొన్నం ప్రభాకర్. ఈయనకు ప్రస్తుతం తెలంగాణ క్యాబెనెట్?లో స్థానం కల్పించారు. అయితే తాను స్టూడెంట్ యూనియన్ లీడర్ గా ఉన్నప్పటి నుంచే ఈ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నానని అందుకే అధ్యక్షుని బాధ్యతలు కేటాయిస్తే పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. ఇలా కాకుండా బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి ఈ పదవి ఇవ్వాలని అధిష్టానం ఆలోచిస్తే.. మధుయాష్కీ గౌడ్ పేరు కూడా బలంగా వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ కూడా ఈ పదవి కోసం ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. పైగా బీసీలకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తామని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కులగణన చేస్తామని చెప్పిన మాటపై కట్టుబడి ఉండేందుకు ఈ పదవిని బీసీ నాయకుడికి ఇచ్చే ఆలోచనలో కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఇలా ఎవరికి వారే కీలక నేతలు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షపదవిపై ఆశలు పెట్టుకోవడంతో ఈ సీటు ఎవరికి వరిస్తుందా అన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. లోక్ సభ ఎన్నికల ఫలితాల తరువాత దీనిపై కాంగ్రెస్ అధిష్టానం ఒక నిర్ణయం తీసుకుని స్పష్టమైన ప్రకటన వెలువరిచే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చించుకుంటున్నారు.

# కౌంటింగ్ నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి

**– భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార**

పెద్దపల్లి :లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన సకల ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉండాలని భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. సోమవారం న్యూ ఢిల్లీ నుంచి భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల కమిషనర్లు గ్యనేష్ కుమార్, డాక్టర్ సుక్ భీర్ సింగ్ సందులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ, సన్నద్ధతపై నిర్వహించిన వీడియో సమావేశంలో హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి పాల్గొనగా, పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఈ వీడియో సమావేశం లో పాల్గొన్నారు. భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ప్రకటించే కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని, దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రంలో ఫలితాలు వెలువడించేందుకు మీడియా కు ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మంచి ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కు ప్రత్యేక కౌంటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్ కు ఈవీఎం యంత్రాల తరలింపుకు అవసరమైన మేర సిబ్బంది ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వహించే ప్రతి సిబ్బందికి వారు నిర్వహించా ల్సిన విధులపై సంపూర్ణ శిక్షణ అందించాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ల ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేయాలని, వివిప్యాట్ లెక్కింపు కు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్లో అవసరమైన మేర కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి టేబుల్ వద్ద ప్రత్యేక బృందాలను నియమించాలని అన్నారు. కౌంటింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరగాలని ఎక్కడ ఎటువంటి చిన్న పొరపాటు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, కౌంటింగ్ కేంద్రాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోము

న్యూ ఢిల్లీ : ఈ నెల ప్రారంభంలో బిజెపి తృణమూల్ కాంగ్రెస్‌ను అవినీతిపరులుగా , హిందువులకు వ్యతిరేకమైనదిగా చిత్రీకరిస్తూ కనీసం 4 దినపత్రికలలో ప్రకటనలు ప్రచురించింది. లోక్ సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఎలాంటి ప్రకటనలను ప్రచురించ కూడదని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన కలకత్తా హైకోర్టు ఆదేశాలపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి న్యాయమూర్తులు జెకె. మహేశ్వరి, కెవి. విశ్వనాథన్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ నిరాకరించింది. "ప్రాథమిక సాక్ష్యాధారాల (ప్రైమా ఫేసీ) దృష్ట్యా ప్రకటన అవమానకరమైనది" అని బెంచ్ పేర్కొంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రాజకీయ పార్టీలు, నాయకులు , అభ్యర్థులు ధృవీకరించని ఆరోపణల ఆధారంగా తమ ప్రత్యర్థులను విమర్శించడాన్ని నిషేధిస్తుంది.

# అవినీతి పరులను వెంటాడుతున్న ఏసీబీ

హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు ఏసీబీ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. లంచం తీసుకుంటున్నారు అనే ఫిర్యాదు వస్తే స్థాయితో సంబంధం లేకుండా అందర్నీ పట్టుకుంటున్నారు. పై స్థాయి అధికారులు లంచాలతో వందల కోట్లు వెనకేసినా పట్టుకుంటున్నారు. ప్రజలకు సేవలు చేయాల్సిన అధికారులు అందు కోసం లంచాలను తీసుకుంటున్నా వదిలి పెట్టడం లేదు. ఎంత మొత్తం అవినీతి అని కాదు.. లంచం అనే మాట వినిపిస్తే దూకుడుగా వెళ్లి అవినీతి పరుల్ని పట్టుకుంటున్నారు. ఇంటి పన్ను అసెస్‌మెంట్ చేసి, ఇంటి నెంబర్ కేటాయించడానికి పదివేలు లంచం తీసుకుంటున్న ఎల్‌బీ నగర్ టాక్స్ ఇనస్పెక్టర్ ను సోమవారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అంతకు ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో పాస్ బుక్ ఇవ్వడానికి రైతు దగ్గర డబ్బులు వసూలు చేసిన తహశీల్దార్ ని, నిర్మల్ లో బిల్ కలెక్టర్ ని.. ఎవరైనా సరే .. ఎంత పెద్ద మొత్తం అన్నది ఆలోచించకుండా పట్టేసుకుంటు న్నారు. ఇంతకు ముందు హైచ్ఎండీఏ మాజీ డైరక్టర్ బాలకృష్ణ, ఏసీపీ ఉమామహేశ్వరరావు లాంటి పెద్ద స్థాయి వ్యక్తుల్ని వదిలి పెట్టలేదు. ప్రభుత్వం మారినప్పటి నుండి ఏసీబీ చాలా దూకుడుగా వ్యవహరి?సతోంది. గవర్నమెంట్ ఆఫీసుల్లో లంచాలు తీసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్న వారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడంతో పాటు ఆదాయానికి మించి అక్రమాస్తులు కూడబెట్టిన ఆఫీసర్ల ఇండ్లపై దాడులు చేస్తున్నారు. గత సర్కార్ హయాంలో అడ్డగోలుగా ఆస్తులు సంపాదించిన పోలీస్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లకు చుక్కలు చూపిస్తున్నారు. గడిచిన ఐదున్నర నెలల్లో దాదాపుగా 60 ఏసీబీ కేసులు నమోదయినట్లుగా తెలుస్తోంది. రోజుకు ఇద్దరు, ముగ్గురు ఆఫీసర్లను ఏసీబీ వలపన్ని పట్టుకుంటున్నది. ఎవరైనా ప్రభుత్వాధికారి లంచం అడిగితే వెంటనే ఏసీపీకి సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. రిపోర్ట్ చేయాల్సిన నంబర్ 1064. అవినీతి నిర్మూలన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏసీబీ అధికారులు గుర్తు చేస్తున్నారు.

# కూరలకు గాయాలు...50 దాటేసిన వెజిటబుల్స్

హైదరాబాద్,: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రైతు బజార్లు, వారపు సంత, కూరగాయల మార్కెట్..ఎక్కడ చూసినా ధరల మోతే. సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి..పెరిగిన ధరలతో సామాన్యులు తిప్పలు పడుతున్నారు..ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.25 వరకు ధర పలుకుతుండగా వారాంతపు సంతల్లో కిలో రూ.60?80 పలుకుతున్నాయి. పచ్చిమిర్చి, చిక్కుడు సెంచరీ చేరువ అవుతుండగా.. బీన్స్ డబుల్ సెంచరీకి చేరువ అవుతుంది. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.100పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని సామాన్యులు వాపోతున్నారు.మిగిలిన కూరగాయల్ని కేజీ 50పైనే ఉన్నాయి.. ధరలు పెరుగుదలకు దిగుబడి లేకపోవటమే కారణమంటున్నారు వ్యాపారులు..రీటైల్ మార్కెట్‌లో అయితే మరి అధిక ధరలకు అమ్ముతున్నారు వ్యాపారులు..దీంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. లంగాణలో కురిసిన అకాల వర్షాలు, మండుతున్న ఎండలు, తగ్గిన సాగువిస్తీర్ణంతో కూరగాయల ధరలు కొండెక్కాయి. క్కుడు కిలో ధర వంద రూపాయలకు చేరింది. బీన్స్ కిలో 150 రూపాయలకు పెరిగింది. కొన్ని కూరగాయల ధరలు సెంచరీ దాటాయి.హైదరాబాద్ నగరంలోని రైతుబజార్లు, వీక్లీ కూరగాయల సంతల్లో కూరగాయలు కొనడానికి వచ్చిన గృహిణులు ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు. కిలోల చొప్పున కూరగాయలు కొనే గృహిణులు పావుకిలో, అరకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.తెలంగాణలో కురిసిన అకాల వర్షాలు, మండుతున్న ఎండలు, తగ్గిన సాగువిస్తీర్ణంతో కూరగాయల ధరలు కొండెక్కాయి. టమాటా ధరలు కిలో మార్కెట్ లో రూ.40లకు విక్రయిస్తుండగా షాపింగ్ మాల్స్ లో 50 రూపాయల ధర పలుకుతోంది. పచ్చిమిర్చి ధర కిలో 150 రూపాయలకు పెరిగింది. సాగునీటి కొరత వల్ల ఈ వేసవిలో పచ్చిమిర్చి దిగుబడి తగ్గింది. మార్కెట్ లోనూ కిలో పచ్చిమిర్చి 120రూపాయలకు విక్రయిస్తున్నారు. బీట్రూట్ కిలో ధర 43 రూపాయల నుంచి 59 రూపాయల దాకా పెరిగింది. ఆలుగడ్డ ధరలు కూడా 30 నుంచి 50 రూపాయల దాకా పెరిగిందిగతంలో చవకగా లభించిన క్యాప్సికం కిలో ధర 55 నుంచి 76 రూపాయలకు పెరిగింది. క్యాబేజీ కిలో ధర 30 నుంచి 54 రూపాయలకు, క్యాలీఫ్లవర్ 31 నుంచి 45 రూపాయలకు చేరింది. క్యారెట్ కిలో ధరల 41 నుంచి 68 రూపాయలకు పెరిగింది. కొబ్బరికాయల ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. 20 రూపాయలకు లభించే కొబ్బరికాయలు 41 రూపాయలకు పెరిగింది. మునక్కాయల ధర కూడా అనూహ్యంగా పెరిగింది. కొత్తిమీర, కరివేపాకు నుంచి గోంగూర, పాలకూర, తోటకూర, కోయ తోటకూర దాకా అన్ని ఆకు కూరల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. వంకాయ కిలో 33 రూపాయల నుంచి 50 రూపాయలకు చేరింది. బీరకాయలు, బెండకాయలు,పచ్చి బఠానా ఇలా ఒకటేమిటి అన్ని రకాల కూరగాయల ధరలు అనూహ్యంగా పెరిగాయి. 10రూపాయల కు లభించే నిమ్మకాయలకు ప్రస్థుతం 40 రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో పలు కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. సిద్ధిపేట, తూఫ్రాన్, భువనగిరి, మేడ్చల్, శంషాబాద్ తదితర హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో కూరగాయలు పండించే వారు. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో ఇతర దూర ప్రాంతాల నుంచి కూరగాయలను రవాణా చేసుకోవాల్సివస్తోంది. దీనివల్ల కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి కూరగాయలు మరో నెలరోజుల దాకా తక్కువగానే వస్తాయని కూరగాయల రైతు యాదయ్య చెప్పారు. తక్కువ కూరగాయలు రావడం వల్ల ధరలు అమాంతం పెంచక తప్పలేదని మరో రైతు భీం రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో మండుతున్న ఎండలతో కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీంతో కూరగాయల కొరత ఏర్పడటంతో ధరలు ఆకాశన్నంటాయి. హైదరాబాద్ నగరంలో రైతుబజార్లతో పాటు వారాంతపు సంతల్లోనూ కూరగాయల ధరలు అనూహ్యంగా పెరగడంతో తాము కొనేటట్టు లేదు, తినేటట్టు లేదని తార్నాకకు చెందిన రాయగిరి రజిత అనే గృహిణి ఆవేదనగా 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు. కూరగాయల ధరలు గణనీయంగా పెరగడంతో వంటిల్లు నిర్వహణ భారం పెరిగిందని మరో గృహిణి టి భవానీ చెప్పారు.ఈ వేసవి చివర తెలంగాణలోని హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలు తగ్గాయని బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ అధికారి కె నర్సింహారెడ్డి చెప్పారు. అకాల వర్షాలు, ఎండలతో దిగుబడులు తగ్గడంతో కూరగాయలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.ఢిల్లీ నుంచి ఆలుగడ్డలు, రాంచీ నుంచి బిన్నీస్, జైపూర్ నుంచి టమాట లారీలు వస్తున్నాయని, దూరాభారం నుంచి కూరగాయలు తెప్పించుకోవాల్సి రావడం వల్ల రవాణ ఖర్చుల భారం వల్ల ధరలు అమాంతం పెరిగాయని బోయిన్ పల్లి కూరగాయల మార్కెట్ కమిషన్ ఏజెంటు గుంటి అజయ్ 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, కర్ణాటకలోని బెల్గాం నుంచి సన్న మిర్చి తెప్పించుకోవడం వల్ల రవాణ చార్జీలు పెరిగాయని అజయ్ పేర్కొన్నారు. ప్రతీ ఏటా బిన్నీస్, చిక్కుడు కాయలు కర్ణాటక నుంచి వస్తుంటాయని, కానీ ఈ ఏడాది సాగునీటి సమస్య వల్ల అక్కడ పండక ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూరగాయల లారీలు తెప్పిస్తున్నామని అజయ్ వివరించారు. రైతులు విస్తారంగా కూరగాయలు పండించే వారని తెలంగాణ హార్టికల్చర్ శాఖ మాజీ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి చెప్పారు.ప్రస్థుతం హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో రియల్ భూమ్ పెరగడం వల్ల కూరగాయలు తోటలు వేసిన భూముల్లో భవనాలు వెలుస్తున్నాయని, దీనివల్ల తెలంగాణలో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిందని వెంకట్రామిరెడ్డి చెప్పారు. కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల కూరగాయలను ఉత్తరాది రాష్ట్రాల నుంచి తెప్పించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన వివరించారు.ఉత్పత్తి తగ్గిపోవడంతో కూరగాయల ధరలు ఉట్టెక్కాయి. అల్లం ధర మార్కెట్లో బాగా పెరిగపోయింది. ఓపెన్ మార్కెట్లో ప్రస్తుతం అల్లం కేజి 250 నుంచి 300 రూపాయలు వరకు ఉంటుంది.. అలాగే రైతు బజార్లలో కొంటే 190 నుంచి 210 వరకు ఉంటుంది.

# అధికృత డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.

## మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ కుమార్.

కమాన్ పూర్: రైతులు అధికృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని కమాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ అన్నారు.మండలంలోని పలు గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో " విత్తన కొనుగోలు లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు " పై రైతులకు రొంపి కుంటలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. మండల వ్యసాయాధికారి బండి ప్రమోద్ రొంపికుంట గ్రామ పంచాయతీ నందు మాట్లాడుతూ రైతులు అధీకృత డీలర్ ల వద్దనే విత్తనాలు కొనాలని మరియు కొనుగోలు సమయం లో డీలర్ నుండి ఖచ్చితంగా రశీదు పొందాలని సూచించారు. అలాగే విత్తనాల కవర్ ని పంట కాలం పూర్తి అయ్యే వరకు కూడా జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు .ఇలా చేస్తే భవిష్యత్ లో ఏదైనా సమస్య ఎదురైనా సులువుగా పరిష్కరించవచ్చని తెలిపారు. మరియు వానాకాలం పంటకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు.వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారి సురేష్ నాయక్ రొంపికుంట గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు ఇట్టి కార్యక్రమ లో అధిక రైతులు పాల్గొన్నారు.

# గ్యారేజీకి మేడిగడ్డ

కరీంనగర్: తెలంగాణ ప్రాణంగా బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ బీఆర్ఎస్ అధికారంలో ఉండగానే కుంగింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఇదీ ఒక కారణం. బ్యారేజీలోని 7వ బ్లాక్ కుంగి దాదాపు పది నెలలు కావస్తోంది. ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడంతో ఇప్పుడు 7వ బ్లాక్ మరమ్మతులపై కాంగ్రెస్ సర్కార్ దృష్టిపెట్టింది. ఈ క్రమంలో కుంగిన గేట్లను ఎత్తే ప్రయత్నం చేస్తోంది.తాజాగా బుధవారం 7వ బ్లాక్‌లోని 16వ నంబర్ గేటు ఎత్తు తుండగా భూగర్భంలో పెద్ద శబ్దాలు వినిపించాయి. ప్రకంపనలు కూడా వచ్చాయి. దీంతో పనులు ఆపేశారు. పెద్ద శబ్దాల వెనుక ఏం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఏడవ బ్లాక్ పియర్ కింద భారీ బుంగ పడి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. దాని కారణంగానే గేటు ఎత్తుతుండగా శబ్దాలు వస్తున్నాయని భావిస్తున్నారు.గతంలో వచ్చిన వరదల కారణంగా బ్యారేజీ పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయిందని బావిస్తున్నారు. దీనికారణంగా 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో భారీ బొరియ ఏర్పడి ఉండొచ్చని జియో ఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల ద్వారా అంచనావకు వచ్చారు. ఈ క్రమంలో టన్నులకొద్దీ బరువు ఉండే గేటు ఎత్తుతున్న క్రమంలో పునాదులపై ఒత్తిడి పడి శబ్దాలు వస్తున్నాయని పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితిలో గేట్లు ఎత్తడం మంచిది కాదని ఇంజినీర్లు భావిస్తున్నారు. పునాదుల కింద ఏర్పడిన ఖాళీలు పూడ్చిన తర్వాతనే గేట్లు ఎత్తాలని నిర్ణయించారు. ఇప్పటికే నీటి లీకేజీలను ఆపేందుకు బ్యారేజీ కుంగిన వెంటనే 40 వేల ఇసుక బస్తాలు వేశారు. అయినా ఇప్పటికీ భారీ ఖాళీ ఉందని భావిస్తున్నారుమేడిగడ్డ బ్యారేజీ దిగువన ఇసుక కొట్టుకుపోవడంతో ఏర్పడిన ఖాళీ ప్రదేశం, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉందన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కుంగిన ఏడు నంబర్ బ్లాక్ దిగువకే ఈ బొరియ పరిమితమై లేదని, మొత్తం బ్యారేజీ కింద ఖాళీ ప్రదేశం ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. దీనిపై స్పష్టత వచ్చాక నిపుణుల కమిటీ సూచన మేరకు ఇసుక, సిమెంటు మిశ్రమాన్ని పంపించి పూడ్చివేయాల్సి ఉంటుంది. మొదట ఖాళీ ప్రదేశం గుర్తించి దానిని పూడ్చిన తర్వాతనే మరమ్మతులు చేపట్టాలని నీటిపారుదల శాఖ భావిస్తోంది. ఈమేరకు అవసరమైన పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది.

# నగరం...నకిలీల మయం..

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుంచి అక్రమార్కుల ఏరివేత విషయంలో దూకుడు పెంచింది. మొన్నటి వరకూ డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపిన సర్కార్.. గత నాలుగైదు రోజులుగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రముఖ హోటల్లు మార్కెట్ మాల్స్ పై ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారుల మెరుపు దాడులు చేశారు. పలు హోటళ్లలో కాలం చెల్లిన ఆహార పదార్థాలు గుర్తించారు. ఇప్పుడు తెలంగాణ వైద్య మండలి అధికారులు పలు క్లినిక్స్‌పై దాడి చేశారు. హైదరాబాద్, మేడ్చల్ పరిధిలోని ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్‌లలో నిర్వహించిన తనిఖీల్లో 50 మంది నకిలీ వైద్యులను గుర్తించారు.8 మంది సభ్యులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తోన్న పలు క్లినిక్స్‌ను సీజ్ చేశారు. కొందరు నకిలీ వైద్యులు ఆరోగ్య కేంద్రాల్లో రోగులను చేర్చుకుని అధికంగా యాంటీ బయాటిక్స్ ఇస్తున్నట్లు గుర్తించారు. డాక్టర్లుగా చెలామణి అవుతూ వారికి అనుసంధానంగా మెడికల్ షాపులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు అధికారులు. దాదాపు 50 మంది నకిలీ వైద్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి, ఇద్దరిని జైలుకు పంపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ వైద్యులు, క్లినిక్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. తప్పుడు ప్రకటనలతో ఔషధాలు తయారు చేసి ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇస్తోన్న తయారీ సంస్థలపైనా తెలంగాణ ఔషధ నియంత్రణ శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు.ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన అధికారులు.. కొన్ని చోట్ల సోదాల్లో నకిలీ ఔషధాలు గుర్తించారు. ప్రజలు ఇలాంటి ఔషధాల పట్ల అలర్ట్‌గా ఉండాలని సూచించారు. నకిలీ మెడిషిన్ విక్రయాలపై టోల్‌ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని డ్రగ్ కంట్రోల్ అధికారులు సూచించారు.వ: జ్వరం వచ్చిందని వీధి చివర ఉండే క్లీనిక్‌కు వెళు తున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త.. నల్లకోటు వేసుకున్న ప్రతివారు లాయర్లు కాదు. అలానే తెల్లకోటు వేసుకున్న ప్రతివారు డాక్టరూ కానక్కర్లేదు.. అందుకే మీకు ఇంజెక్షన్ చేసే డాక్టర్ అసలు డాక్టరేనా..? అతను లేదా ఆమె రాసే మందులు నిజంగా మన బాడీకి అవసరమేనా? అన్నది ఆలోచించండి.. లేదంటే ఉన్న రోగం పోతుందో లేదో తెలియదు కానీ.. కొత్త రోగం రావడం మాత్రం గ్యారెంటీగా కనిపిస్తోంది ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. డాక్టర్లు అంటూ బోర్డులు ఉంటాయి. ఆసుపత్రులు వెలుస్తాయి.పక్కనే మెడికల్ షాప్‌లు.. ఆ పక్కనే డయాగ్నొస్టిక్ సెంటర్లు. ఎవరైనా ఇబ్బంది పడుతూ వచ్చారంటే చాలు. ఇక్కడ ఫీజులు.. అక్కడ టెస్టులు.. వెళ్లేప్పుడు మిగిలిన డబ్బులను మెడికల్ షాపుల్లో సమర్పించుకొని వెళ్లడం. ఇదే తంతు జరుగుతోంది. మరి వీటన్నింటికి అనుమతులు ఉంటాయా అంటే ఉండవు. పోనీ రోగం చేయాల్సిన పద్ధతుల్లో నయం చేస్తున్నారా? అంటే అదీ లేదు. అప్పటికప్పుడు నయం కావడానికి హైడోస్ యాంటి బయాటిక్స్ వాడటం. దీంతో అసలుకే మోసం వస్తుందంటున్నారు అసలైన డాక్టర్లు?తెలంగాణ స్టేట్‌వైడ్‌గా సోదాలు జరుపుతున్నారు తెలంగాణ వైద్య మండలి సభ్యులు. ఎలాంటి సర్టిఫికెట్స్ లేకుండా.. ఖీఓఖ ముసుగులో ఆసుపత్రులను నడుపుతున్న వారి భరతం పడుతున్నారు. ఒక్క హైదరాబాద్‌లోని చింతల్, షాపూర్‌నగర్ ప్రాంతాల్లో సోదాలు చేస్తే.. 50 మంది నకిలీ డాక్టర్ల లెక్క తేలింది. ఏ ఇబ్బంది ఉంది అని బాధితులు వచ్చినా.. ఆసుపత్రుల్లో చేర్చుకోవడం.. పెద్ద సంఖ్యలో యాంటీ బయాటిక్స్ ఇవ్వడం. ఇదే సీన్ ప్రతిసారి రీపిట్ అవుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు.. ఇప్పటికే స్టేట్‌వైడ్‌గా సోదాలు మొదలుపెట్టారు. 50 మంది డాక్టర్లపై ఈఎఖీలు కూడా నమోదు చేశారు. ఇప్పటికే కొంత మందిని జైలుకు కూడా పంపారు.రోగులకు చికిత్స చేయాలంటే ఉండాల్సింది. ముందు సరైన అవగాహన.. తగినంత నాలెడ్జ్.. అన్నింటికంటే కావాల్సింది అనుభవం. బట్ చాలామంది నకిలీ డాక్టర్లుగా చెలామణి అవుతున్న వారికి ఇవేవీ ఉండవు. కానీ ట్రీట్‌మెంట్ చేసేస్తారు.. కొన్ని సార్లు ప్రాణాలు కూడా తీస్తారు. నిజానికి రూల్స్ ప్రకారం ఆర్ఎంపీ, పీఎంపీలు.. ఫస్ట్ ఎయిడ్ చేసేందుకు మాత్రమే పరిమితం కావాలి. తమ సెంటర్‌కు ప్రథమ చికిత్స కేంద్రం అని బోర్డు మాత్రమే పెట్టుకోవాలి. పసి పిల్లల నుంచి పండు ముసలి వరకు హేవీ డోస్ ఇంజక్షన్లు.. పెయిన్ కిల్లర్స్, యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇచ్చేస్తున్నారు. వీటి వల్ల ఉన్న రోగం తగ్గకపోగా కొత్తగా ఫిట్స్ రావడం. బీపీ పెరగడం, తగ్గడం, తల తిరగడం, వాంతులు, ఒంటి నొప్పులు కొత్తగా తయారవుతున్నాయి. ఈ టైమ్‌లో సరైన ట్రీట్‌మెంట్ అందకపోతే.. మరణమే శరణమవుతుంది..చాలా రోజులుగా ఆర్ఎంపీ, పీఎంపీలపై సర్కార్ కంట్రోల్ లేదు. దీంతో వాడకో క్లినిక్ ఏర్పాటు చేసి ప్రాక్టీస్ మొదలు పెట్టేశారు. ఏదైనా ఓ హాస్పిటల్‌లో నాలుగు నెలలు పనిచేస్తే చాలు. తర్వాత ఆర్ఎంపీలుగా అవతారం ఎత్తేవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో రేవంత్ సర్కార్ వీరిపై ఫోకస్ చేసింది. క్లినిక్ పేరుతో ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్న వారిపై ఉక్కుపాదం మోపుతోంది. మూడు నెలలుగా ఖీఓఖ, ఖఓఖ ప్రాక్టీషనర్లపై వరుసగా తనిఖీలు చేస్తోంది.

ఇదంతా నాణేనాకి ఒకవైపు.. మరోవైపు తాము ఏ అక్రమాలు చేయలేదంటున్నారు ఆర్ఎంపీ డాక్టర్లు.. వెంటనే ప్రభుత్వం సోదాలను ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. తాము ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేస్తున్నామని చెబుతున్నారు. కావాలనే తమపై కేసులు నమోదు చేస్తున్నారనేది వారి ఆరోపణ.. నిజంగా ఫస్ట్ ఎయిడ్ చేసే వారికి ఎలాంటి బాధ లేదు. ఫస్ట్ ఎయిడ్ సెంటర్ కాకుండా.. క్లినిక్ అనే బోర్డు ఉన్నా.. ఆ క్లినిక్‌లో బెడ్స్ ఉన్నా.. మెడికల్ షాప్స్ ఉన్నా.. ఇకనైనా వెంటనే తొలగించండి. లేదా నేడో, రేపో అధికారులు వస్తారు. కేసులు నమోదు చేస్తారు.. ఇది మాత్రం తథ్యం.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

కరీంనగర్: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. మొన్న వరంగల్ కలెక్టర్ పేరుతో నకిలీ అకౌంట్ ఓపెన్ చేసి పలువురికి పంపిన కేటుగాళ్లు తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ పేరుతో నకిలీ అకౌంట్ ఓపెన్ చేసి సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేశారు.రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పేరుతో నకిలీ అకౌంట్ ఓపెన్ చేశారు. శ్రీలంక దేశానికి చెందిన ఫోన్ నంబరు +94755455869 నెంబర్ తో ఏర్పాటు చేసిన నకిలీ ఖాతాలను సోషల్ మీడియా ద్వారా పలువురికి పంపిస్తున్నారు. వెంటనే కలెక్టర్ అప్రమత్తమయ్యారు.జిల్లాలో సోషల్ మీడియాలో తన పేరిట వచ్చే తప్పుడు కథనాలు, ఫోన్ నంబరు నుంచి వచ్చే మోసపూరిత వాట్సప్ మెసేజ్ లను జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు నమ్మొద్దని కోరారు. జిల్లా కలెక్టర్ పేరిట మోసపూరిత మెసేజ్ లు పలు తప్పుడు కథనాలు, వాట్సప్, ఫేస్ బుక్ వివిధ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజలు వాటిని నమ్మడం గానీ, ఇలాంటి మెసేజ్ లను షేర్ చేయడంగానీ చేయొద్దని విజ్ఞప్తి చేశారు.స్మార్ట్ ఫోన్ లు వాడే వారు తప్పక మొబైల్ యాప్లను వాడుతూనే ఉంటారు. పలు రకాల పనుల కోసం ఎన్నో రకాల వెబ్ సైట్ లను వినియోగిస్తుంటారు. దీంతో ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు లింక్ లను పంపి మోసాలకు తెరతీస్తున్నారు. అయితే ఇలాంటి అనుమానాస్పద వెబ్ సైట్ లింక్లను ఓపెన్ సోర్స్ సైబర్ టూల్స్ ను గుర్తించవచ్చని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్ సీఎస్బీ) అధికారులు చెబుతున్నారు.

**సైబర్' ముప్పును గుర్తించండిలా**

వెబ్ సైట్ల అక్షరాలు మారుస్తూ మోసాలు సైబర్ నేరగాళ్లు నిజమైన వెబ్సైట్లను పోలి ఉండేలా పేర్లు పెడుతూ మోసగిస్తుంటారు. ఉదాహరణకు 'ఎజీఫ్త్రనీనీ.ఇనీఎ'ను కొద్దిపాటి మార్పులతో అందులోని అక్షరాలకు సున్నాలు చేర్చి 'జజీఫ్త్ర00.ఇనీఎ'గా మారుస్తుంటారు.అలాగే అమెజాన్ వెబ్సైట్ కు ఒఎజీజూ ఎ.నివబి' పెడుతున్నట్లు సైబర్ భద్రత నిపుణులు వివరిస్తున్నారు. నిజమైన వెబ్సైట్లను గుర్తించేందుకు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచిస్తున్నారు. ఇంటర్నెట్ టూల్స్ సాయంతో.. ఒక వెబ్సైట్ సురక్షితమైందో లేదో గూగుల్ సేఫ్ బ్రౌజర్ ట్రాన్సపరెన్సీ రిపోర్ట్ ద్వారా తెలుసుకోవచ్చు.ఇందుకోసం ష్ట్రబిబిజూబ:// బితీజీనిబజూజీతీవనిఇఎతీవజూనీతీబి. ఐనీనీణశ్రీవ. ఇనీఎ/ బజీటవడ ఎతీనీలిబతినిణ/బవజీతీఇష్ట్ర? ష్ట్రశ్రీ= వని లోకి వెళ్ళి మనం చెక్ చేయాలనుకొనే వెబ్ సైట్ యూఆర్ఎల్ ను నమోదు చేస్తే అది నిజమైనదో లేక నకిలీదో చిటికెలో తేలుస్తుంది. మనకు వచ్చిన లింక్ ని వెబ్సైట్లో ఉన్న కంపెనీ విశ్వసనీయత గురించి తెలుసుకునేందుకు ష్ట్రబిబిజూబ://లిలిలి.ఎఎఎ.నీతీణ/ లో సెర్చ్ చేయవచ్చు. ఓపెన్ సోర్స్ వెబ్సైట్లు, టూల్స్ తో నకిలీ వెబ్సైట్ల నుంచి వచ్చే వైరస్, ఫిషింగ్ లింక్ లు, మాల్ వేర్ లను గుర్తించొచ్చు.

# ఆపద వస్తే ఆదుకోవడం అందరి బాధ్యత

## మాజీ జెడ్పిటిసి మైదం భారతి వరప్రసాద్.

కమాన్ పూర్. ఆపద వస్తే ఆదుకోవడం అందరి బాధ్యత అని ముత్తారం మాజీ జెడ్పిటిసి మైదం భారతి వరప్రసాద్ అన్నారు. రామగిరి మండలం ఆదివారం పేట చెందిన నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం ముత్తారం మాజీ జెడ్పీటీసీ మైదం భారతి – వరప్రసాద్ అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సోమవారం రామగిరి మండలం ఆదివారం పేట గ్రామం చెందిన మజీద్ ముజావర్ రహీన అనారోగ్యం తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకి 3000 రూపాయల ఆర్థిక సహాయం మాజీ జడ్పీటీసీ మైదం భారతి వరప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న గ్రామ అధ్యక్షులు మైదనీ బుచ్చయ్య మాజీ ఉపసర్పంచ్ అట్టే తిరుపతి రెడ్డి మాజీ ఎంపీటీసీ కన్నూరి నర్సింగరావు గ్రామ ఎస్సీసెల్ అధ్యక్షులు కన్నూరి శ్రీకాంత్ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్ రెడ్డి ఎండీ ఇస్మైల్ తదితరులు పాల్గొన్నారు...

# రిజర్వేషన్లు పెంచాలి

## మందకృష్ణ మాదిగ




హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే రాష్ట్రంలో ఏ నిర్ణయమైనా తీసుకోవాలని ఎమ్మార్పిఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ అన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా రాష్ట్రంలో పోరాటం మొదలవుతుంది. ఆ పోరాటం రేవంత్ కు రాజకీయ ఉరితాడు అవుతుంది. పెంచితే మీకు మేలు పెంచకపోతే మీరే తీవ్రంగా నష్టపోతారు. జూన్ 10 వరకు రిజర్వేషన్లపై సానుకూల నిర్ణయం తీసుకోకపోతే తీవ్ర ఉద్యమ కార్యచరణ ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎవరి ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్రంలోని 80 శాతానికి పైగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీలకు నష్టం చేస్తున్నారు. చేవెళ్ల సభలో ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ చేశారు. సభ జరిగే ఆరు నెలలు అయింది ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అయింది అయినా ఎందుకు నిర్ణయం తీసుకోలేదు. కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి ఆరు నెలలు అయింది ఎందుకు బీసీలకు రిజర్వేషన్ పెంచలేదు. రేవంత్ మాటమీద నిలబడే మనిషి కాదని రుజువు అవుతుందని అన్నారు. బీసీ కులగనలకు ఆరు నెలలు అవసరం లేదు. ఎందుకు ఆలస్యం చేస్తున్నారు ఎవరి ప్రయోజనాల కోసం ఆలస్యం చేస్తున్నారు. ఆయా వర్గాల నుంచి వ్యతిరేకత తప్పదు. బడ్జెట్ సమావేశాల కంటే ముందే రిజర్వేషన్లు పెంచకపోతే ఎస్సీ ఎస్టీలు 5000 కోట్లపైగా నష్టపోతారు. ఎస్సీ ఎస్టీ బీసీల నోటి కాడ కూడును ఎవరికి ఇవ్వడానికి ఇలాంటివి చేస్తున్నారు. రేవంత్ తీరు మార్చుకోకపోతే ఎస్సీ ఎస్టీ బీసీల పోరాటం మొదలవుతుంది ఆ తీవ్రతకు కొట్టుకుపోవాల్సిందేనని అన్నారు.

# ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్లు లెక్కించాలి

జిల్లా కలెక్టర్ యాష్మీన్ భాషా

జగిత్యాల:లోకసభ ఎన్నికల లెక్కింపు సజావుగా, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు లెక్కించాలనీ జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ లకు శిక్షణ శిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ యాష్మీన్ భాషా మాట్లాడుతూ కౌంటింగ్ కు కేటాయించబడిన సిబ్బంది సమయానికి హాజరుకావాలన్నారు. ఎలాంటి తప్పులకు తావివ్వకుండా సమయ స్ఫూర్తి తో విధులు నిర్వహించాలన్నారు. ఓట్ల లెక్కింపు కు కేటాయించబడిన సిబ్బంది చివరి వరకు ఎలాంటి లెక్కింపు చేపట్టాలో చివరి ర్యాండమైజేశన్ తరువాత తెలుస్తుందని తెలిపారు. కౌంటింగ్ కు కేటాయించబడిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్, కంట్రోల్ యూనిట్, వి.వి. ప్యాట్ ల లెక్కింపులు కేటాయించవచ్చని తెలిపారు. లెక్కింపు సమయంలో జాగ్రత్తగా ఎలాంటి తప్పులు లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాలను మాస్టర్ శిక్షకులు పడాల తిరుపతి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, జగిత్యాల, మెట్ పల్లిఆర్డీఓ లు పి.మధుసూదన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పాతాళం నుంచి ఫైనల్‌కు.. సన్‌రైజర్స్ ఆట మారిందిలా..!

ఐపీఎల్ పదిహేడో సీజన్ ఫైనల్లో దారుణ ఓటమి సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మింగుడుపడనిదే. లీగ్ దశలో, క్వాలిఫయర్ 1లో, ఆఖరికి టైటిల్ పోరులోనూ కోల్‌కతా గండాన్ని ప్యాట్ కమిన్స్ సేన దాటలేకపోయింది.

చెపాక్ స్టేడియంలో హైదరాబాద్ బ్యాటర్ల చెత్తాట చూసిన అభిమానులంతా లీగ్ దశలో రికార్డులు బద్ధలు కొట్టిన జట్టేనా ? అని ఆశ్చర్యపోయారు. సమిష్టి వైఫల్యంతో ట్రోఫీ చేజార్చుకున్న ఆరెంజ్ ఆర్మీ.. ఈ సీజన్‌లో మర్చిపోలేని బ్యాటింగ్ విన్యాసాలకు కేరాఫ్ అయింది. పదహారో సీజన్‌లో అట్టడుగను నిలిచిన హైదరాబాద్ జట్టు ఈసారి సంచలన విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. రన్నరప్‌గా నిలవడం గత ఏడాదితో పోల్చితే గొప్ప విజయమే అంటున్నారు విశ్లేషకులు.

ఐపీఎల్ మాజీ చాంపియన్ సన్‌రైజర్స్ టైటిల్‌కు అడుగు దూరంలో బొక్కబోర్లాపడింది. టేబుల్ టాపర్ కోల్‌కతా ధాటికి నిలవలేక భారీ ఓటమితో కప్పు చేజార్చుకుంది. 2016లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో చాంపియన్‌గా అవతరించిన సన్‌రైజర్స్ ఆట ఆ తర్వాత అధ్వాన్నంగా మారింది. 2023 ఎడిషన్‌లో పాతాళంలో నిలిచిన సన్‌రైజర్స్ ఆట ఒక్క సీజన్‌తో మారిపోయింది.

**హెడ్‌కోచ్‌గా వెటోరీ**

పదహారో సీజన్‌లో జట్టు దారుణ ప్రదర్శనతో చిర్రెత్తుకొచ్చిన యాజమాన్యం బ్యాటింగ్ కోచ్ బ్రియాన్ లారా పై వేటు వేసిన మేనేజ్‌మెంట్..హెడ్‌కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ సారథి డేనియల్ వెటోరీని మించింది. మినీ వేలంలో రూ.20 కోట్లు పెట్టి ప్యాట్ కమిన్స్ ను, ట్రావిస్ హెడ లను కొనడం కలిసొచ్చింది. వీరిద్దరి రాకతో ఆరెంజ్ ఆర్మీ దూకుడుకు చిరునామాగా మారింది. ఇక ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మల మెరుపు బ్యాటింగ్‌కు.. హెన్రిచ్ క్లాసెన్, మర్క్‌రమ్, షాబాద్‌ల క్లాస్ ఇన్నింగ్స్ తోడవ్వడం హైదరాబాద్‌కు రికార్డు బ్రేకర్ ట్యాగ్ తీసుకొచ్చాయి.

**ఉప్పల్ స్టేడియంలో ఊచకోత**

ఉప్పల్ స్టేడియంలో ముంబై ఇండియన్స్ బౌలర్లను హెడ్, అభిషేక్‌లు ఉతికారేయగా.. క్లాసెన్, మర్క్‌రమ్‌లు అర్ధ శతకాలతో హోరెత్తించారు. దాంతో కమిన్స్ సేన 13 ఏండ్ల క్రితం ఆర్సీబీ పేరిట ఉన్న అత్యధిక స్కోర్(272) రికార్డును బద్ధలు కొట్టేసింది. అనంతరం చిన్నస్వామి స్టేడియంలో మరోసారి సన్‌రైజర్స్ బ్యాటర్లు పూనకాలు వచ్చినట్టు



చెలరేగారు. హెడ్ సుడిగాలిలా సెంచరీ బాదేయగా.. క్లాసెన్ ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడడంతో హైదరాబాద్ జట్టు 287 రన్స్ కొట్టి రికార్డు స్కోర్‌ను మరోసారి బ్రేక్ చేసింది. దాంతో, ఒకదశలో టాస్ గెలిచి కమిన్స్ బృందానికి ఫస్ట్ బ్యాటింగ్ ఇవ్వాలంటే ప్రత్యర్థి జట్లు భయపడిపోయాయి. అలాంటిది ప్లే ఆఫ్స్ వచ్చేసరికి సన్‌రైజర్స్ టాప్ గన్స్ ఒక్కటీ పేలలేదు.

**బ్యాటింగ్‌నే నమ్ముకొని..**

క్వాలిఫయర్ 1లో, క్వాలిఫయర్ 2లో.. ఆఖరికి ఫైనల్లోనూ ఓపెనర్లు హెడ్, అభిషేక్‌లు తీవ్రంగా నిరాశపరిచారు. దాంతో, మిగతావాళ్లు సైతం దంచలేక డగౌట్ చేరారు. సీజన్ ఆసాంతం బ్యాటింగ్‌నే నమ్ముకోవడం నాకౌట్ మ్యాచుల్లో హైదరాబాద్ జట్టును ఘోరంగా దెబ్బతీసింది. సన్‌రైజర్స్ బౌలింగ్ యూనిట్‌కు బలమైన వెటరన్ పేసర్ భువనేశ్వర్ ఈ సీజన్‌లో విఫలమయ్యాడు.

నటరాజన్ ఒక్కడే వికెట్లు తీయగా.. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన క్వాలిఫయర్ 2లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లు షాబాజ్, అభిషేక్‌లు సంచలన స్పెల్‌తో జట్టును గెలిపించారు. ఫైనల్లో కోల్‌కతాపై హైదరాబాద్ బ్యాటర్లు ప్రతీకారంతో చెలరేగిపోతారనుకుంటే స్టార్క్ తొలి ఓవర్లోనే వికెట్ తీయడంతో అందరూ ఒత్తిడికి లోనయ్యారు. కొట్టింది 113 పరుగులే అయినా.. బౌలింగ్‌లోనూన కనీస పోరాటం చేయకుండానే సన్‌రైజర్స్ జట్టు అప్పనంగా కోల్‌కతాకు ట్రోఫీని అందించింది.

పదిహేడో సీజన్‌లో సన్‌రైజర్స్ పేరు మార్మోగేలా చేసిన ప్రతి ఒక్కరికి కావ్యా మారన్ అభినందనలు చెప్పింది. ఫైనల్లో ఓటమి బాధలో ఉన్న జట్టు సభ్యులతో మాట్లాడిన ఆమె మిమ్మల్ని చూసి గర్వపడుతున్నాం అని చెప్పింది. ఈ సీజన్‌లో ఆటతోనే కాకుండా మంచి ప్రవర్తనతోనూ ఆరెంజ్ ఆర్మీ పలు అవార్డులు కొట్టేసింది.

# ప్రజ్ఞానంద ముందంజ.. డ్రాతో సరిపెట్టుకున్న కార్ల్‌సన్

ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద బోణీ కొట్టాడు. తొలి పోరులోనే ఫ్రెంచ్ ఆటగాడు అలిరెజా ఫిరౌజాపై గెలుపొందాడు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తెల్ల పావులతో ఆడిన ప్రజ్ఞానంద ఆరంభ నుంచి దూకుడు కనబరిచాడు. కేవలం 38 ఎత్తుల్లోనే ప్రజ్ఞానంద ప్రత్యర్థిని చిత్తు చేశాడు. ఫిరౌజాపై భారత గ్రాండ్‌మాస్టర్‌కు ఇదే మొదటి విజయం కావడం విశేషం. ఈ మధ్యే వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద షాకిచ్చి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

నార్వే చెస్ టోర్నీలో స్థానిక ఆటగాడు కార్ల్‌సన్ వరల్డ్ చాంపియన్ డింగ్ లీరెన్‌తో మ్యాచ్ డ్రా చేసుకున్నాడు. అమెరికా గ్రాండ్ మాస్టర్ హికా నకమురా తోటి అమెరికన్ ఫాబియానో కరౌనపై విజయం సాధించాడు. తొలి రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద, కార్ల్‌సన్, నకమురాలు 1.5 పాయింట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఈ టోర్నీలో



జరుగుతున్న పురుషుల, మహిళల క్లాసికల్ గేమ్స్ డ్రాగా ముగిశాయి. దాంతో, విజేతలను నిర్ణయించేందుకు ఆరో అర్మగెడ్డన్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

# అమెరికా టీ20 లీగ్‌కు 'ఏ' స్టేటస్.. ఇకపై ప్రతిదీ రికార్డే

టీ20 వరల్డ్ కప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న అమెరికాకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (%×జజ%) శుభవార్త చెప్పింది. ఆ దేశం నిర్వహిస్తున్న మేజర్ లీగ్ క్రికెట్ కు లిస్ట్ 'ఏ' స్టేటస్ ఇచ్చింది.

తద్వారా ఎంఎల్‌సీకి అధికారికంగా టీ20 లీగ్ గుర్తింపు వచ్చేసింది. అంతేకాదు అసోసియేటెడ్ నేషన్స్‌కు చెందిన రెండో లీగ్‌గా ఎంఎల్‌సీ రికార్డులకెక్కింది. ఇంతకుముందు యూఏఈకి చెందిన ఇంటర్నేషనల్ లీగ్ టీ20 కి ఐసీసీ ఏ స్టేటస్ కట్టబెట్టింది. ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాలో క్రికెట్ ప్రమాణాలు మెరుగుపడేందుకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఏ స్టేటస్ రావడంతో ఇకపై మేజర్ లీగ్ క్రికెట్‌లో నమోదైన సెంచరీలు, అర్ధ శతకాలు బ్యాటర్ల ఖాతాలో చేరుతాయి. జూలై 5 నుంచి బౌలర్లు ఎన్ని వికెట్లు తీశారు? ఏ జట్టు రికార్డు స్కోర్ కొట్టింది? అనేది గణాంకాలుగా రికార్డవుతాయి. దాంతో, అమెరికా క్రికెట్ పెద్దలు ఐసీసీ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఇది అమెరికా క్రికెట్‌కు మహర్ధశ అని వాళ్లు అంటున్నారు. నిరుడు




జరిగిన ఎంఎల్‌సీ తొలి సీజన్‌లో ఎంఐ న్యూయార్క్ జట్టు విజేతగా అవతరించింది. ఎంఎల్‌సీ రెండో సీజన్ జూలై 5 నుంచి ప్రారంభం కానుంది. 2025లో జరిగే ఈ సీజన్‌లో 34 మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు ఎంఎల్‌షీ సీఈవో విజయ్ శ్రీనివాసన్ వెల్లడించాడు.

# నాలుగు దేశాల్లో టాప్ స్కోరర్.. చరిత్ర సృష్టించిన ఫుట్‌బాల్ మాంత్రికుడు

ఫుట్‌బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో అరుదైన ఘనత సాధించాడు. సౌదీ ప్రో లీగ్స్ లో టాప్ గోల్ స్కోరర్‌గా రికార్డు సృష్టించాడు.

అల్ నస్రీ క్లబ్‌కు ఆడుతున్న రొనాల్డో మే 27న అల్ ఇతిహద్ జట్టుపై రెండు గోల్స్ కొట్టాడు. దాంతో, సౌదీ ప్రో లీగ్ ఒకే సీజన్‌లో అత్యధిక గోల్స్ బాదిన ఫుట్‌బాలర్‌గా చరిత్రపుటల్లోకెక్కాడు. ఈ సీజన్‌లో ఈ ఫార్వర్డ్ ప్లేయర్ రికార్డు స్థాయిలో 35 సార్లు బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. తద్వారా 34 గోల్స్‌తో అబ్దెరజాక్ హమ్మదిల్లా పేరిట ఉన్న రికార్డును రొనాల్డో బద్ధలు కొట్టేశాడు. అంతేకాదు నాలుగు దేశాల్లోని లీగ్స్‌లో అత్యధిక గోల్స్ కొట్టిన ఏకైక ఆటగాడిగా 39 ఏండ్ల మరో రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. పోర్చుగల్ కెప్టెన్ అయిన రొనాల్డో ఇంతకుముందు ప్రీమియర్ లీగ్, లా లిగా, సెరీ ఏ తరపున అత్యధిక గోల్స్ వీరుడిగా నిలిచాడు.

మరో 7 గోల్స్ సాధిస్తే.. ప్రపంచంలోని మేటి ఫుట్‌బాలర్లలో ఒకడైన రొనాల్డో 2022 ఫిఫా వరల్డ్ కప్ తర్వాత అల్ నస్రీ క్లబ్‌కు మారాడు. అప్పటి నుంచి ఆ క్లబ్ రాతే మారిపోయింది. సౌదీ ప్రో లీగ్‌లో




రొనాల్డో కెప్టెన్సీలో ఆడిన అల్ నస్రీ క్లబ్ విజయాల బాట పట్టింది. తాజాగా ఒకే సీజన్‌లో 35 గోల్స్‌తో రొనాల్డో చరిత్రను తిరగరాశాడు. ప్రస్తుతం ఈ ఫుట్‌బాల్ మాంత్రికుడి ఖాతాలో 893 గోల్స్ ఉన్నాయి. మరో 7 గోల్స్ కనుక సాధిస్తే.. కెరీర్‌లో 900 గోల్స్ సాధించిన ఏకైక ఫుట్‌బాలర్‌గా రొనాల్డో రికార్డు సృష్టిస్తాడు.

# ఐపీఎల్ - డబ్ల్యూపీఎల్ ఫైనల్స్.. ఈ పోలికలను గమనించారా?

ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన లీగుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఒకటి. బీసీసీఐ ఆధ్వర్యంలో 17 సీజన్ల నుంచి దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈసారి కోల్‌కతా నైట్‌రైడర్స్ ఛాంపియన్‌గా నిలిచి మూడోసారి కప్‌ను సొంతం చేసుకుంది. బీసీసీఐ మరొక టోర్నీ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మహిళల కోసం 'వుమెన్ ప్రీమియర్ లీగ్'ను గతేడాది నుంచి ప్రారంభించింది. ఈ సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వుమెన్ జట్టు నిలిచింది.అయితే, ఇప్పుడీ కేకేఆర్ విజయానికి.. అప్పుడు ఆర్సీబీడబ్ల్యూ టీమ్ గెలుపు మధ్య కొన్ని ఆసక్తికర పోలికలు నెట్టింట వైరల్‌గా మారాయి. అవేంటో ఓ లుక్కేద్దాం.. డబ్ల్యూపీఎల్ ఫైనల్‌లో దిల్లీ క్యాపిటల్స్ – ఆర్సీబీ డబ్ల్యూ తలపడ్డాయి. డీసీని ఆసీస్ ప్లేయర్ మెగ్ లానింగ్ నడిపించగా.. ఆర్సీబీకి భారత స్టార్ స్మృతీ మంధాన కెప్టెన్సీ చేసింది.ఐపీఎల్ ఫైనల్‌లో సన్‌రైజర్స్‌కు ఆసీస్ స్టార్ ఆటగాడు పాట్ కమిన్స్ నాయకత్వం వహించగా..

కోల్‌కతాకు భారత ప్లేయర్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉన్నాడు. డబ్ల్యూపీఎల్‌లో టాస్ నెగ్గిన దిల్లీ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఐపీఎల్‌లోనూ ఎస్ఆర్‌హెచ్ అదే నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మొదట బ్యాటింగ్ చేసిన దిల్లీ 18.3 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటైంది. ఇక ఐపీఎల్‌లో హైదరాబాద్ కూడా సరిగ్గా అవే పరుగులు




చేసి ఇన్నింగ్స్‌ను ముగించింది. డబ్ల్యూపీఎల్‌లో దిల్లీ నిర్దేశించిన లక్ష్యాన్ని బెంగళూరు కేవలం రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి ఛేదించింది. %ఖూా% 2024లో కేకేఆర్ కూడా 8 వికెట్ల తేడాతో గెలిచింది. ఐపీఎల్ ఫైనల్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఆసీస్ క్రికెటర్ మిచెల్ స్టార్క్ అందుకోగా.. %భూా% 2024లోనూ ఆసీస్ ప్లేయర్ సోఫీ మోలినెక్స్ దక్కించుకోవడం గమనార్హం. రెండు టోర్నీల్లోనూ భారత జట్టుకు చెందిన ప్లేయర్లే కెప్టెన్‌గా ఉన్న టీమ్‌లు టైటిల్‌ను అందుకున్నాయి.

# ఆ నలుగురిపై వేటు.. వరల్డ్ కప్‌లో భారత తుదిజట్టు ఇదే!

మరో నాలుగు రోజుల్లో మహా సమరం ప్రారంభం కానుంది. జూన్ 2న నుంచి మొదలయ్యే టీ20 వరల్డ్ కప్‌కు అమెరికా–వెస్టిండీస్ ఉమ్మడిగా ఆతిథ్యం ఇస్తున్నాయి.

వన్డే వరల్డ్ కప్‌ను తృటిలో చేజార్చుకున్న భారత్ పొట్టి ప్రపంచకప్‌లో హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ సారి కప్‌ను ముద్దాడాలని పక్కా ప్రణాళికలతో యూఎస్ఏలో అడుగుపెట్టింది.

అయితే ప్రత్యర్థితో కంటే జట్టు కూర్పుతోనే భారత్ ఎక్కువగా పోరాడాల్సిన పరిస్థితి తలెత్తింది. గాయాల నుంచి కోలుకుని రిషభ్ పంత్, హార్దిక్ పాండ్య తిరిగి రావడంతో జట్టు బలోపేతంగా మారడంతో పాటు గందరగోళంగా ఏర్పడింది. అంతేగాక ప్రపంచకప్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో కొందరు ఫామ్‌లేమితో ఉన్నారు. అలాగే రెండు నెలలు పాటు ఆటగాళ్లు అవిరామంగా క్రికెట్ ఆడారు.

మెగా టోర్నీకి ఇది మంచి సన్నాహకంగానే ఉంటుంది. కానీ టీమిండియాలో ఆడే స్థానాల్లో ఫ్రాంచైజీల తరపున మన ఆటగాళ్లు ఆడలేదు. వన్‌డౌన్‌లో వచ్చే విరాట్ కోహ్లి ఆర్సీబీ తరఫున ఓపెనర్‌గా వచ్చాడు. మిడిలార్డర్‌లో ఆడాల్సిన సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్‌కు మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఇక సీఎస్కే తరఫున శివమ్ దూబె నాలుగో స్థానంలో ఆడాడు. కానీ భారత జట్టులో వాళ్లు ఆడే స్థానాలు భిన్నంగా ఉన్నాయి. మరోవైపు దూబె, సూర్యకుమార్ యాదవ్, యశస్వీ జైస్వాల్, హార్దిక్ పాండ్య ఫామ్‌లో లేకపోవడం టీమిండియాను తీవ్రంగా కలవరపెడుతోంది. అయితే ఫామ్ లేకపోయినప్పటికీ ఈ ఆటగాళ్లకు గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌ల వరకు అవకాశం ఇవ్వాలని టీమ్ మేనేజ్మెంట్ ఆలోచిస్తోంది. భారత్ గ్రూప్ దశ నుంచి సూపర్–8కు అర్హత సాధించడం కష్టతరమేమి కాదు. దీంతో గ్రూప్ స్టేజ్‌లోనే జట్టు కూర్పును సిద్ధం చేసుకోవాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది.

ఈ నేపథ్యంలో సంజు శాంసన్, అక్షర్ పటేల్, యుజువేంద్ర చాహల్, అర్షదీప్ సింగ్‌లను కొన్ని మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితం చేయాలని ప్లాన్ చేస్తోంది. తుదిజట్టులో సెలక్ట్ అయ్యే మిగిలిన ఆటగాళ్లు అట్టర్ ఫ్లాప్ అయితే సూపర్–8లో ఈ నలుగురికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. కాగా, గ్రూప్–ఏలో భారత్‌తో పాటు పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, ఆతిథ్య జట్టు అమెరికా ఉన్నాయి. న్యూయార్క్ వేదికగా జూన్ 5న ఐర్లాండ్‌తో టీమిండియా తమ తొలి మ్యాచ్ ఆడనుంది.




**భారత తుది జట్టు (అంచనా):**

రోహిత్ శర్మ, యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, శివమ్ దూబె, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్

**టీ20 వరల్డ్ కప్‌కు ఎంపిక చేసిన టీమిండియా:**

రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్) సంజు శాంసన్ (వికెట్ కీపర్), శివమ్ దూబె, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్

రిజర్వ్ ప్లేయర్లు: శుబ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేష్ ఖాన్.

# టీమ్‌ఇండియా హెడ్ కోచ్ జాబ్.. మోదీ, అమిత్ షా, సచిన్, షారుక్ పేరిట ఫేక్ అప్లికేషన్స్

టీమ్ ఇండియా పురుషుల క్రికెట్ జట్టుకు హెడ్ కోచ్ పదవి కోసం బీసీసీఐ ఇటీవలే దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం ప్రధాన కోచ్ బాధ్యతలను రాహుల్ ద్రావిడ్ నిర్వర్తిస్తున్నాడు. అయితే జూన్ చివరి నాటికి అతని పదవీకాలం ముగియనున్నది. అమెరికాలో జరిగే టీ20 వరల్డ్‌కప్ అతనికి చివరి టోర్నీ కానున్నది. దీంతో హెడ్ కోచ్ పదవి కోసం బీసీసీఐ జారీ చేసిన దరఖాస్తు గడువు కూడా మే 27తో ముగిసింది. ఈ నేపథ్యంలో గడువు ముగిసే సరికి హెడ్ కోచ్ పదవి కోసం సుమారు 3 వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. అయితే వాటిలో భారీ సంఖ్యలో నకిలీ దరఖాస్తులు ఉన్నాయి. కొందరు ఆకతాయిలు ఏకంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సహా క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ, హర్భజన్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్, బాలీవుడ్ స్టార్ నటుడు షారుక్ ఖాన్ సహా పలువురి పేర్లతో ఫేక్ అప్లికేషన్లు పంపారు.

ఇప్పటి వరకూ అందిన దరఖాస్తుల్లో చాలా వరకూ మాజీ క్రికెటర్లు, ప్రముఖుల పేర్లే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో బీసీసీఐ ఇప్పుడు ఫేక్ అప్లికేషన్లను ఏరివేసే పనిలో పడింది.

మరోవైపు సెలక్షన్ ప్రక్రియలో అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఉంటాయి. ఆ తర్వాత అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ చేస్తారు. కొత్తగా ఎంపికైన హెడ్ కోచ్ జూలై ఒకటో తేదీ నుంచి బాధ్యతలను చేపడతాడు. 2027, డిసెంబర్ 31వ తేదీ వరకు కొత్త కోచ్ తన బాధ్యతలను నిర్వర్తించనున్నాడు. జూలైలో శ్రీలంకతో



జరిగే టెస్టు సిరీస్‌తో కొత్త కోచ్ బాధ్యతలు మొదలవుతాయి. ఆ తర్వాత స్వదేశంలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌తో సిరీస్‌లు ఉంటాయి. ఇక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా వెళ్తారు. 2025లో పాకిస్థాన్‌లో చాంపియన్స్ ట్రోఫీ ఉంటుంది. ఆ తర్వాత ఏడాది ఇండియా, శ్రీలంక దేశాలు టీ20 వరల్డ్‌కప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 2027లో సౌతాఫ్రికాలో జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌కు కూడా కొత్త కోచే ఉంటాడు. కోహ్లీ, రోహిత్ కెరీర్‌లు దగ్గరపడుతున్న నేపథ్యంలో.. కొత్త కోచ్ ఆ ఇద్దరి స్థానాలను ఫిక్స్ చేయాల్సిన బాధ్యతలను తీసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు హెడ్ కోచ్ పదవి కోసం ఇప్పటికే పలువురు మాజీ క్రికెట్ దిగ్గజాల పేర్లు వినిపించిన విషయం తెలిసిందే. గౌతమ్ గంభీర్, ఆస్ట్రేలియా క్రికెటర్ రికీ పాంటింగ్ వంటి ప్రముఖుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

# టీ20 ప్రపంచకప్‌లో దక్కని చోటు.. ఎట్టకేలకు మౌనం వీడిన రింకూ సింగ్..

ఐపీఎల్ ముగిసింది. మరో ఐదు రోజుల్లో టీ20 ప్రపంచకప్ మొదలుకానుంది. అమెరికా, వెస్టిండీస్ దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ పొట్టి ప్రపంచకప్ భారత కాలమానం ప్రకారం జూన్ 2 నుంచి ప్రారంభం కానుంది. ఈ మెగాటోర్నీలో పాల్గొనేందుకు భారత జట్టు ఇప్పటికే అమెరికాకు చేరుకుంది. కాగా.. ఈ టోర్నీకి ఖచ్చితంగా ఎంపిక అవుతాడని భావించిన నయా ఫినిషర్ రింకూ సింగ్‌కు 15 మంది సభ్యులు గల బృందంలో స్థానం దక్కని సంగతి తెలిసిందే.

అయితే.. రిజ్వర్ జాబితాలో అతడికి సెలక్టర్లు చోటి ఇచ్చారు. అంటే.. 15 మంది సభ్యులు గల బృందంలో ఎవరైనా గాయపడినా, లేక మరేదైన కారణంతో అందుబాటులో లేకుంటే అప్పుడు వారి స్థానంలో రింకూ సింగ్‌ను తీసుకుంటారు. కాగా.. రింకూ సింగ్ ను ఎంపిక చేయకపోవడాన్ని మాజీ క్రికెటర్లు తప్పుబట్టారు. దీనిపై పెద్ద ఎత్తున చర్చ నడిచింది. స్పందించిన రింకూ సింగ్..

ప్రపంచకప్ జట్టులో ఎంపిక కాకపోవడంపై మొదటి సారి రింకూ సింగ్ స్పందించాడు. కెప్టెన్ రోహిత్ శర్మ తనతో ఏం చెప్పాడనే విషయాన్ని వెల్లడించాడు. పొట్టి ప్రపంచకప్‌లో చోటు దక్కకపోవడం తనకు బాధ కలిగించిందన్నాడు. మనం ఎంత బాగా ఆడుతున్నప్పటికీ ఎంపిక కాకపోతే సహజంగా ఎవరైనా బాధపడతారన్నాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 **SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**